# సమైక్యతతోనే తెలుగు జాతి ప్రగతి



పొట్టి శ్రీరాములు గారు



బూర్గుల రామకృష్ణారావు గారు




రచయిత : శ్రీ వడ్డే శోభనాద్రీశ్వర రావు
ఆం.ప్ర. మాజీ వ్యవసాయ శాఖామంత్రి



సురవరం ప్రతాపరెడ్డి గారు

ప్రచురణ కర్త : శ్రీ వెలగపూడి గోపాలకృష్ణప్రసాద్



ప్రకాశం పంతులు గారు

# సమైక్యతతోనే తెలుగు జాతి ప్రగతి

ఉన్నతమైన సాంస్కృతిక వారసత్వం, వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆంధ్రులు తమ కంటూ ఒక ప్రత్యేక రాష్ట్రమనేది లేకుండా పరాయి పంచన మద్రాసు రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉన్న దుస్థితి నుంచి తప్పించి, తెలుగువారికంటూ ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవడంలో ఎందరో మహానుభావుల కృషి, త్యాగాలు ఉన్నాయి. ఈ కోవలో మనం మొదట స్మరించుకోవలసిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు గారు. 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు త్యజించిన ఆ మహానుభావుడి త్యాగ ఫలితమే ఆంధ్రరాష్ట్రం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి భాష ప్రతిపదికగా విడిపోయిన మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రరాష్ట్రం. అక్టోబర్ 1,1953 న కర్నూలు రాజధానిగా, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారు తొలి ముఖ్యమంత్రిగా ఆవిర్భవించింది ఆంధ్రరాష్ట్రం. నైజాం నవాబు నిరంకుశ పాలన నుండి విముక్తి పొందిన తెలుగు మాట్లాడే ప్రాంతమంతా ఆంధ్రప్రాంతంతో కలిసి "విశాలాంధ్ర" గా-"ఆంధ్రప్రదేశ్"గా నవంబర్ 1, 1956 న ఆవిర్భవించడానికి మన తెలుగు జాతి, తెలుగు భాష, అపార సాంస్కృతిక వారసత్వం పట్ల అభిమానం కలిగిన ఎందరో మహానుభావుల కృషి ఉంది. అయ్యదేవర కాళేశ్వరావు, టంగుటూరి ప్రకాశం పంతులు, స్వామీ రామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, కాళోజి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, మగ్దూం మొహియుద్దీన్ వంటి వారందరూ ఆంధ్ర ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయులే.

2013 జూలై 30వతేదీ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రచరిత్రలో ఒక అత్యంత దురదృష్టకరమైన చీకటి రోజుగా మిగిలిపోతుంది. 57 సం.లుగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి, హైదరాబాద్ నగరంతో కూడిన తెలంగాణా రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి విభజించాలనే నిర్ణయాన్ని కేంద్రంలో పరిపాలిస్తున్న యు.పి.యే కూటమి ఏకగ్రీవంగా తీసుకుందని, కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణా రాష్ట్రాన్ని దేశంలో 29వ రాష్ట్రంగా

ఏర్పాటు చేయ తలపెట్టారని దిగ్విజయ్ సింగ్ చేసిన ప్రకటన కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది.

**భారతదేశంలో నిజాం విలీనం:**

స్వాతంత్ర్యం రాక పూర్వం మద్రాసు రాష్ట్రంలో ఉన్న తెలుగు ప్రజలు, దరిమిలా ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న తెలుగు ప్రజలు, హైదరాబాద్ నైజాం సంస్థానంలో ఉన్న తెలుగు ప్రజలు కలిసి విశాలాంధ్రగా ఒకటవ్వాలనే ఆకాంక్ష స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి సమాంతరంగా స్వాతంత్ర్యోద్యమంతో పాటు కొనసాగుతూ వచ్చింది. మద్రాసు నుండి విడిపోయినపుడు ఆంధ్రరాష్ట్రానికి నూతనంగా రాజధాని ఏర్పాటుచేసుకొనే నిమిత్తం, అదనంగా నిధులేమీ అదించలేదు. కర్నూలు రాజధానిగా కలక్టరు కార్యాలయమే సచివాలయంగా కార్యకలాపాలు కొనసాగాయి. గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేయబడింది. 1947 ఆగష్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం లభించినా, హైదరాబాద్ నైజాం నవాబు భారతయూనియన్ లో చేరడానికి తిరస్కరించారు. ఖాసిమ్ రజ్వీ, రజాకార్ల ఆగడాలు మితిమీరాయి. తెలంగాణా రైతాంగ పోరాటం కూడ అదే సమయంలో కొనసాగింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సరిహద్దు గ్రామాల్లోని తెలుగువారు, హైదరాబాద్ సంస్థానంలో కృషిచేస్తూ వున్న పోరాట యోధులకు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారు. వందలాది మంది యువకులు ఆ పోరాటంలో అసువులు బాసారు. సర్దార్‌వల్లభభాయ్‌పటేల్ చొరవతో జనరల్ చౌదరి నాయకత్వంలో భారతసైన్యం రావడంతో గత్యంతరం లేక హైదరాబాద్ నవాబు భారతయూనియన్‌లో చేరడానికి అంగీకరించారు. ఫలితంగా హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడింది.

**విశాలాంధ్ర కావాలి:**

నిజాం పరిపాలనలో ఉర్దూ రాజభాష. హిందీ, మరాఠీ భాషల కన్నా తెలుగు భాషకు తక్కువ గౌరవం లభిస్తూ ఉండేది. ఇందుకు నిరసనగానే నైజాం ఆంధ్ర మహాసభ ఏర్పడింది. అనంతర కాలంలో తెలుగు ప్రజలంతా ఒక్క రాష్ట్రంలో ఉండాలనే లక్ష్యంతో విశాలాంధ్ర మహాసభ ఏర్పడి, అనన్యమైన కృషి చేసింది.

దేశంలో కొన్ని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అవసరమని భారత ప్రభుత్వం భావించి, ఫజులాలీ కమిషన్‌ను నియమించింది. ఆంధ్రరాష్ట్రం, హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రజల అభిప్రాయాలను పరిగణనలో ఉంచుకొని హైదరాబాద్ సంస్థానంలో మరాఠీ మాట్లాడే ప్రాంతాన్ని బొంబాయి రాష్ట్రంలో కలపాలని, కన్నడం మాట్లాడే వారిని మైసూరు రాష్ట్రంలో కలపాలని, తెలుగు మాట్లాడే ప్రాంతాలను, ఆంధ్రరాష్ట్రాన్ని తెలుగు ప్రజల సమగ్ర అభివృద్ధికి ఒకే రాష్ట్రంగా ఏర్పాటుచేయడం సముచితంగా వుటుందని తెల్పింది. ఆ సమయంలో తెలంగాణా ప్రాంతంలో కొద్ది మంది నాయకులు ఆంధ్రరాష్ట్రంలో కలపడానికి అభ్యంతరం వ్యక్తం చేసారు. నైజాం పరిపాలనలో అగ్ర వర్ణాలకు చెందిన జాగీరుదారులు, భూస్వాములు గ్రామాలలోని బలహీన వర్గాల ప్రజలను, సన్నకారు చిన్న రైతులను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తూ ఉండేవారు. కొంతమంది జాగీరుదారుల క్రింద వేలకు వేల ఎకరాలు ఉంటూ ఉండేవి. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరిన తరువాత ఈ భూస్వాములు, జాగీరుదార్ల రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతూ వచ్చింది. అటువంటి వర్గాలకు చెందిన వారు కొందరు హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంతో కలపవద్దని కోరిన వారిలో ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ఎన్నో కష్ట నష్టాలకు గురైన నాయకులు అనేక మంది, ప్రజా బాహుళ్యం విశాలాంధ్రకు అనుకూలం.

ఒక 5 సం.లు వేచి చూసి, 1961 శాసన సభ ఎన్నికల తర్వాత ఏర్పడే శాసన సభలో మూడింట రెండు వంతులు సభ్యులు విలీనానికి అంగీకరిస్తే ఆంధ్రరాష్ట్రాన్ని, హైదరాబాద్ రాష్ట్రాన్ని కలపాలని రికమండ్ చేసింది. కొద్ది మంది నాయకులు మినహా ఎక్కువ మంది నాయకులు, విశాల జన బాహుళ్యం త్వరగా తెలుగు ప్రజలంతా ఒక్కటి కావాలన్న భావోద్వేగంలో ఉన్నారు. ఆగష్టు 19, 1953న ఆంధ్రరాష్ట్ర బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటు నిజామాబాద్ యం.పి. హెడా, కరీంనగర్ యం.పి. యం.ఆర్.కృష్ణ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర రాజధానిగా కర్నూలులో మౌలిక వసతులు లేనందున, హైదరాబాద్ నగరంలో అన్ని విధాలా వసతులు ఉన్నందున హైదరాబాద్

రాష్ట్రాన్ని త్వరగా విడదీసి హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రరాష్ట్రంతో కలిపి తెలుగువారికి ఒక రాష్ట్రం ఏర్పరచాలని చెప్పారు. ఆనాడు హైదరాబాద్ ముఖ్యమంత్రిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు గారు శాసన సభలో మొదటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ పైన అధికార తీర్మానాన్ని చర్చించేందుకు నవంబర్ 25, 1955 నుండి డిసెంబరు 3, 1955 వరకు వారం పాటు జరిగిన చర్చలో 174 మంది శాసన సభ్యుల్లో 103 మంది విలీనానికి అనుకులంగాను, 29 మంది వ్యతిరేకంగాను ,15 మంది తటస్థంగాను అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ప్రత్యేకంగా తెలంగాణా ప్రాంతం నుండి చూసినపుడు 59 మంది విశాలాంధ్ర కు అనుకూలంగా చెప్పగా, 25 మంది వ్యతిరేకంగానూ, ఒకరు తటస్థంగాను ఉన్నారు.

మార్చి 7, 1956 న నాటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గారు నిజామాబాద్ బహిరంగ సభలో మాట్లాడుతూ " విశాలాంధ్ర నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఫజల్ అలీ కమిషన్ సూచన ప్రకారం 5 సం॥ల తర్వాత జరుగవలసిన పనిని అంత దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడం సరికాదని " చెప్పారు. విశాలాంధ్ర ఏర్పడటానికి జవహర్ లాల్ నెహ్రూ గారు వ్యతిరేకమని ప్రత్యేక తెలంగాణావాదులు చేస్తున్న ప్రచారం శుద్ధ అబద్ధం.

**పెద్ద మనుష్యుల ఒప్పందం:**

1956 నవంబర్ 1న హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. ఆసమయంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముఖ్యులు కొందరు, తెలంగాణా ప్రాంతానికి చెందిన ముఖ్యులు కొందరు అప్పటి వరకు పలురంగాలలో తెలంగాణా ప్రాంతం వెనుకబడి ఉన్నందున, ఆ ప్రాంత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి కొన్ని సూచనలతో 19 జులై 1956 న పెద్ద మనుషుల ఒప్పందం ఏర్పడింది. దాని ప్రకారంగా నైజాం సంస్థానంలో అప్పటికి అమలులోనున్న స్థానికులకు ప్రాధాన్యత నిచ్చే "ముల్కీ" నిబంధనలు ఐదు సంవత్సరాల పాటు ఉండాలని, అవసరమైతే మరొక ఐదేండ్లు అమలులో ఉండాలని, దాని ప్రకారంగా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో స్థానికంగా 12 సం॥లు నుండి నివాసం ఉంటున్న వారు అర్హులవుతారు. ముఖ్యమంత్రి ఒక ప్రాంతంవారైతే ఉప ముఖ్యమంత్రి మరొక ప్రాంతంవారుగా

ఉండాలని ఒక అంగీకారానికి వచ్చారు. రాష్ట్రంలో పరిపాలనా వ్యయాన్ని ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాల జనాభా నిష్పత్తి ప్రకారం భరించాలి. తెలంగాణాకు సంబంధించి మద్య నిషేదం లేనందున అక్కడ వచ్చే ఎక్సైజ్ డ్యూటీ మిగులు ఆదాయాన్ని తెలంగాణా అభివృద్ధికే వినియోగించాలి. తెలంగాణా ప్రాంతంలో విద్యా సౌకర్యాలు తెలంగాణా విద్యార్థులకే ఉపయోగపడాలి. సాంకేతిక విద్యా సంస్థలతో సహా కళాశాలల్లోని ప్రవేశాలన్నింటిని తెలంగాణా విద్యార్థులకే కేటాయించాలి. ప్రాంతీయ కమిటీని ఏర్పరచాలి వంటి అంశాలతో ఒక అంగీకారానికి వచ్చారు. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన ప్రణాళిక, అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు వంటి అంశాలు పరిశీలించి తగు నిర్ణయం తీసుకొనే అధికారం ఈ కమిటీకి ఉంటుంది.

**ఒప్పందం - ఉల్లంఘనలు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నీలం సంజీవరెడ్డిగారు ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణా ప్రాంతం వారిని నియమించలేదు. ఉద్యోగ నియామకాల్లో కొద్ది పాటి ఉల్లంఘనలు జరిగాయి. సంజీవరెడ్డిగారు రెండవ పర్యాయం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు కూడా ఉపముఖ్యమంత్రిగా తెలంగాణా ప్రాంతం వారిని నియమించలేదు. పెద్దమనుష్యుల ఒప్పందం పైన సంతకం చేసిన నీలం సంజీవరెడ్డి గారు ఆ అంశాన్ని ఉల్లంఘించడం పొరపాటు. ఇది ఆ తరువాత తెలంగాణా వాదులు పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘించబడిందని పదే పదే వాదించటానికి ఇది ఒక కారణమయ్యింది. 1969 నాటికి తెలంగాణా ప్రాంతంలో ఒక లక్ష ఏడు వేల నాన్ గెజిటెడ్ ఉద్యోగాలలో కేవలం ఐదు వేల మంది "నాన్ ముల్కీ"లుగా తేలారు. వీరిలో వైద్య, ఆరోగ్య రంగాలలో సేవ చేయటానికి సుమారు 1800 మంది నర్సులు, మిడ్‌వైఫ్‌లు, ఆక్సిలరీ నర్సులు కేరళ నుండి, చదువు చెప్పటానికి 1600 మంది ఉపాధ్యాయులు, కార్యాలయాలలో యంత్రాంగాన్ని నడిపించేందుకు సాయపడటానికి 400 స్టెనోగ్రాఫర్స్, అత్యవసర సర్వీసులు, ప్రాణాలు కాపాడటానికి ఇతరాలుగా 1200 మంది,

విద్యుత్, సాంకేతిక, వైద్య, మంచినీరు రంగాలలో ఉన్నారు. అప్పట్లో ఆ ప్రాంతంలో అర్హమైన వారు లభించక పట్టుబట్టి పైన పేర్కొన్న విధంగా ఆంధ్ర ప్రాంతం వారిని నియమించుకున్నారు అనేది గమనార్హం.

నైజాం పరిపాలనలో ఉర్దూ రాజభాషగా ఉండేది. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఆంధ్రప్రాంతంతో పోలిస్తే అక్షరాశ్యత శాతం చాలా తక్కువగా వుంది. కావున అక్కడ విద్యారంగాన్ని అభివృద్ధి కావించుకొనే ప్రయత్నంలో అర్హతకల్గిన ఉపాధ్యాయుల కొరత ఉండటంవల్ల ఆంధ్రప్రాంతానికి చెందిన వారిని ఉపాధ్యాయుల ఉద్యోగాల్లో ఆ ప్రాంతానికి చెందిన స్థానిక సంస్థల నాయకులు నియమించారు.

**జై తెలంగాణా - జై ఆంధ్రా ఉద్యమాలు:**

1967లో కాసు బ్రహ్మానందరెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది.ఇంతలో ముల్కీ నిబంధనల గడువు ముగిసింది. కొందరు ఉద్యోగులు ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా హైకోర్టులో వేసిన పిటిషన్‌ను పరిశీలించి ముల్కీ రూల్స్ కాలపరిమితి ముగిసినందున అవి యిక చెల్లవని తీర్పు ఇచ్చింది. తర్వాత కాలంలో ఖర్చు చేసారు. విద్యా ఉద్యోగావకాశాలు తమకు తగ్గిపోతాయనే భావనతో విద్యార్థుల్లో మొదలైన అశాంతి ఉద్యమంగా మారింది. తెలంగాణా ప్రాంతంలోని ఉద్యోగాలను తెలంగాణేతరులు కాజేసారనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగి విద్యార్థులలో, యువతలో ఆందోళన ప్రారంభమయింది. వీరిలో చాలా మందిని 1969 తర్వాత ఆంధ్ర ప్రాంతానికి బదిలీ చేశారు. తెలంగాణా ప్రాంతంలో మద్య నిషేదం లేనందున ఎక్సైజు మిగులు ఆదాయం 1968 నాటికి రూ॥ 33 కోట్లు అప్రాంత ప్రగతికి వెచ్చించబడి ఉండలేదు. తర్వాత కాలంలో ఖర్చు చేశారు.

జై తెలంగాణా ఉద్యమంలోకి మర్రి చెన్నారెడ్డి గారు ప్రవేశించి నాయకత్వం వహించి, ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. తెలంగాణా ప్రజాసమితిని ఏర్పాటుచేశారు. 1971లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలంగాణా ప్రాంతం నుండి 10 మంది పార్లమెంటు సభ్యులు తెలంగాణా

ప్రజాసమితి తరుపున గెలిచారు. 1968లో మర్రి చెన్నారెడ్డి గారి ఎన్నిక చెల్లదని వారిపై పోటీ చేసిన వందేమాతరం రామచంద్రరావు గారు హైకోర్టులో పిటిషన్ వేయగా చెన్నారెడ్డి గారి ఎన్నిక చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సుప్రీం కోర్టు కూడ సమర్ధించింది. ఆ విషయంలో ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి గారు తనకు సహాయం చేయలేదనే ఆగ్రహంతో చెనారెడ్డి గారు ఉన్నారు. శ్రీమతి ఇందిరాగాంధీ గారు బ్రహ్మానందరెడ్డి గారిని తప్పించి పి.వి. నరసింహారావు గారిని ముఖ్యమంత్రిగా నియమించగానే, తెలంగాణా ప్రజాసమితిని కాంగ్రెస్ పార్టీలో చెన్నారెడ్డి విలీనం చేశారు. శ్రీమతి ఇందిరాగాంధీ గారు తెలంగాణా ఆందోళన దృష్టిలో పెట్టుకుని అష్టసూత్ర ప్రణాళికను ప్రకటించారు. ముల్కీపై హైకోర్టు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు చేయగా, సుప్రీం కోర్టు ముల్కీ నిబంధనలు చెల్లుతాయని అక్టోబర్ 3, 1972 న తీర్పు చెప్పింది. ఇదే అంతిమ తీర్పు అనే రీతిలో ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు గారు ప్రకటించారు. సొంత రాజధానిలో ద్వితీయ శ్రేణి పౌరుల జీవితం మాకెందుకని ఉద్యోగులు, విద్యాఉద్యోగావకాశాల్లో తమకు అన్యాయం జరుగుతుందనే భావనతో విద్యార్థులతో "జై ఆంధ్ర" ఉద్యమం ప్రారంభమైంది. దాదాపు 3 మాసాలు ఉధృతంగా కొనసాగింది. దాదాపు 300 మంది ప్రాణాలు కొల్పోయారు. విజయవాడలో సంగ్రామ్‌చౌక్‌లో పోలీసుకాల్పుల్లో నలుగురు విద్యార్థులు మరణించడాన్ని తట్టుకోలేక కాకాని వెంకటరత్నంగారు గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. అయితే ఆనాడు తెలంగాణాను విడదీయాలని తెలంగాణావాదులు కోరలేదు. డిసెంబరు 1972 లో సహకార శాఖా మంత్రిగా ఉన్న బత్తిన సుబ్బారావు గారి రాజీనామాతో ప్రారంభమై, ఉపముఖ్యమంత్రిగా ఉన్న బి.వి. సుబ్బారెడ్డి గారితో సహా 8 మంది మంత్రులు, 92 మంది ఆంధ్ర ప్రాంత శాసనసభ్యులు ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని కోరుతూ విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ లో సమావేశమై తీర్మానించారు. పి.వి.నరసింహారావు గారి మంత్రి వర్గం జనవరి 17, 1973 న రాజీనామా చేయగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. దాదాపు 10 మాసాలు రాష్ట్రపతి పాలన సాగింది.

**శ్రీమతి ఇందిరా గాంధీ చారిత్రాత్మక ప్రసంగం:**

ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ "పంచసూత్ర పథకం" బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఎంతో ఉద్వేగ భరితంగా 5 గంటల పాటు డిసెంబర్ 21, 1972 న చర్చ జరిగింది. తెలుగు ప్రజలు 1000 సం॥లకు పూర్వం నుండి కలిసి ఉన్న చరిత్ర ఉన్నదని, అందువలననే తెలుగు ప్రజలంతా ఒక్క రాష్ట్రంగా ఉండాలని కోరుకున్నారని, ఉభయ ప్రాంతాలలోని ప్రజలు బలంగా "విశాలాంధ్ర" కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేయటం వలననే 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో శాస్త్రీయత, హేతుబద్ధత ఉన్నాయని, తాత్కాలికమైన భావోద్వేగాల వలన వీటిని విస్మరించడం వాంఛనీయం కాదని, వెనక్కి తీసుకోవడానికి వీలులేని చర్యలను తీసుకోవడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని ఆమె స్పష్టం చేశారు. సరైన, సమర్థనీయమైన, శాస్త్రీయమైన కారణాలు లేకుండా రాష్ట్రాలను విభజించుకుంటూ వెళితే దేశం ఏమవుతుందని, ఈ ధోరణి ఎక్కడికి వెళ్ళి ఆగుతుందని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర విభజనను ఎట్టి పరిస్థితులలోనూ తమ ప్రభుత్వం అంగీకరించదని, ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలను సరిదిద్దటానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తుందని ఆమె స్పష్టం చేశారు. లోకసభలో 40 మంది వ్యతిరేకించగా 233 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించారు.

ఈ బిల్లుపైనే రాజ్యసభలో చర్చ జరిగే సమయంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు తెలంగాణా ప్రాంతం ఎంతో వెనుకబడి ఉండటం వలన ఈ సమస్య తలెత్తిందని తమ ఇరు ప్రాంతాలలోనూ పరస్పరం కొన్ని అనుమానాలు అపోహలు ఉన్నప్పటికి కలిసి ప్రయాణం చేయక తప్పదన్నారు. రాష్ట్రంలో తెలంగాణా ప్రాంతం మాత్రమే వెనుకబడి లేదని, ప్రతి రాష్ట్రంలోనూ కొన్ని తక్కువ అభివృద్ధి పొందిన ప్రాంతాలు ఉంటాయని, అలాగే ప్రతి నగరంలోనూ కొన్ని అభివృద్ధి చెందని ప్రాంతాలు ఉంటాయని అంత మాత్రం చేత విభజనే పరిష్కారం కాదని, వాస్తవానికి తెలంగాణా ప్రాంతం కన్నా రాయలసీమ ప్రాంతం ఆర్థిక పరంగా మరింత

వెనుకబడి ఉందని ఆమె సభ్యులకు తెలియపరిచారు. భావోద్వేగాలలో కొట్టుకుపోరాదని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**విభజిస్తే పరిణామాల గురించి ఆలోచించారా?**

1973 ఫిబ్రవరి నెలాఖరుకు "జై ఆంధ్ర" ఉద్యమ తీవ్రత తగ్గిన దరిమిలా మార్చి 5, 1973 న మాజీ ఉపముఖ్యమంత్రి బి.వి.సుబ్బారెడ్డి గారు ప్రధానమంత్రి ఇందిరా గాంధీని కలిసారు. ఆ సందర్భంలో నదీ జలాలను ఏ విధంగా పంపిణీ చేయవలసి ఉంటుందని, ప్రాంతాల మధ్య ఆస్తులను, అప్పులను ఏ విధంగా పంచవలసి ఉంటుందని, ఒక వేళ విడదీస్తే రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేయాలని, విడదీసిన పక్షంలో రాయలసీమ పరిస్థితి ఏ విధంగా ఉంటుందని ఆమె సుబ్బారెడ్డి గారిని ప్రశ్నించింది. ఆమె అడిగిన ప్రశ్నల్లో ఏ ఒక్కదానికి సుబ్బారెడ్డి గారి వద్ద సమాధానం లేదు. "తెలంగాణా ప్రాంతం వారు ఆంధ్ర ప్రాంతం వారిని దోపిడిదారులని నిందిస్తూ ఉన్నారు కాబట్టి మేము వాళ్లతో ఎందుకు కలిసి ఉండాలి" అని మాత్రం అన్నారట. ఉభయ ప్రాంతాలలోని విభజన వాదులతో, సమైక్య వాదులతోనూ చర్చించి రాష్ట్ర సమస్యకు ఒక అంగీకారయోగ్యమైన రాజీ ప్రదిపాదనను రూపొందించడానికి దాదాపు ఆరు మాసాల సమయం పట్టింది. విభజన అనంతరం ఏర్పడే సమస్యల గురించి ఆనాడు శ్రీమతి ఇందిరా గాంధీ గారు ఆలోచించిన విధంగా, పరిష్కరించే దిశగా ఈనాడు కేంద్ర ప్రభుత్వం కృషి చేయకపోవడం వలనే ఇప్పటి దురదృష్టకర పరిస్థితి ఏర్పడింది.

**ఆరు సూత్రాల పథకం:**

ఉభయప్రాంతాల్లోని కాంగ్రెస్ నాయకులతో చర్చించి ఆరుసూత్రాల పథకాన్ని రూపొందించారు. అప్పటి వరకు తెలంగాణాలో కొనసాగుతూవున్న "ప్రాంతీయ కమిటీ" ని, 'ముల్కీ'ని రద్దు చేసి రాష్ట్రాన్ని 6 జోన్లుగా వర్గీకరించి, ఒక స్థాయిలో ఉద్యోగుల వరకు స్థానికులకు ప్రాధాన్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగాలలో 80 శాతం, నాన్ గెజిటెడ్ ఉద్యోగాలలో 70 శాతం, గెజిటెడ్ ఉద్యోగాలలో 60 శాతం వరకు స్థానికులకు రిజర్వ్

చేయడం జరిగింది. హైదరాబాదులో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసారు. 1973 నవంబర్ 5న రాష్ట్ర శాసనసభ దాదాపు ఏకగ్రీవంగా ఆరు సూత్రాల పథకాన్ని ఆమోదించింది. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా, బి.వి.సుబ్బారెడ్డి ఉప ముఖ్యమంత్రిగా డిసెంబరు 10, 1973 న నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

ఇందుకనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాయి. రాజధానీ నగరమైన హైదరాబాద్‌లో - సెక్రటేరియట్, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు, ఇతర రాష్ట్రస్థాయి ప్రభుత్వసంస్థలలోని ఉద్యోగాలు ఈ ఉత్తర్వుల నుండి మినహాయింపు ఇవ్వబడ్డాయి. హైదరాబాద్ రాజధానీ నగరమైనందున శాంతి భద్రతలను కాపాడడానికి, వివిధ వర్గాల మధ్య సామరస్యతను కాపాడడానికి హైదరాబాద్ నగర పోలిస్ పరిధిలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందినవారికి అవకాశం వుండేలా 14ఎఫ్ క్లాజును (పోలీస్ కమీషనరేట్ ఉద్యోగాలకు సంబంధించి) రాష్టపతి ఉత్తర్వుల నుంచి మినహాయించడం జరిగింది. 1978 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య, భవనం వెంకటరాంరెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి వరుసగా ముఖ్యమంత్రులుగా కొనసాగారు. 1983 నుండి 89 వరకు యన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రి. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా తెలంగాణా ఉద్యోగ సంఘాలు తమకు అన్యాయం జరుగుతూ ఉందని ఫిర్యాదు చేయగా ఏకసభ్య 'గిర్‌గ్లాని కమిషన్'ను నియమించారు. ఆయన సమర్పించిన రిపోర్టును పరిశీలించి ఉద్యోగ నియామకాలు మరింత పకడ్బందీగా, సజావుగా జరిగేందుకు 610 జీఓ డిసెంబర్ 30, 1985 న ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి ముఖ్యమంత్రులుగా (1989-94) వ్యవహరించారు. 1994 శాసనసభ ఎన్నికల్లో మళ్ళీ తెలుగుదేశం పార్టీ విజయాన్ని సాధించి ఎన్.టి.రామారావుగారు ముఖ్యమంత్రి అయ్యారు.

**పేద ప్రజలే దేవుళ్ళు - సమాజమే దేవాలయం:**

తెలుగుదేశంలో జరిగిన కొన్ని పరిణామాలలో 1996లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. 1999 లో జరిగిన ఎన్నికల్లో తిరిగి తెలుగుదేశం గెల్చి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా 2 రూ. కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టడం. పక్కాగృహాలు, జనతావస్త్రాలు, 50 రూ.లకు ఒక హార్స్ పవర్ వ్యవసాయ విద్యుత్తు, వంటి ప్రజాకర్షక పథకాలతో పాటు సామాన్యునికి అందుబాటులో పాలన కొరకు మండలవ్యవస్థను ఏర్పరచడం, వెనుకబడిన వర్గాలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించడం, గ్రామాధికారుల వ్యవస్థను రద్దు చేయడం వల్ల, ప్రత్యేకించి తెలంగాణా ప్రాంతంలో అణగారిన పేద వెనుకబడిన వర్గాల్లో, సన్న కారు - చిన్న రైతుల్లో తెలుగుదేశం పార్టీకి బలమైన పునాది ఏర్పడి ప్రజాదరణ లభించింది. ఎన్.టి.రామారావు గారు 50రూ. లకు హార్స్‌పవర్ విద్యుత్‌పథకం పెట్టినందువల్ల కొత్తగా దాదాపు 12 లక్షల కనెక్షన్లు పెరిగాయి. వీటిలో అధికభాగం తెలంగాణా ప్రాంతానివి.

**తె.రా.స ఆవిర్భావం:**

1999 ఎన్నికల తర్వాత ఏర్పడిన చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో కె.చంద్రశేఖర్‌రావుకు స్థానం లభించలేదు. ప్రతిభాభారతి స్పీకర్‌గా, కె.చంద్రశేఖర్‌రావు డిప్యూటీ స్పీకర్‌గా నిర్ణయం జరిగింది. దీనితో చంద్రశేఖర్‌రావు అసంతృప్తికి గురై, దాన్ని తెలియపరుస్తూ వచ్చినా, చంద్రబాబు నాయుడు స్పందించలేదు. అప్పట్లో దేశంలో సంస్కరణలను వేగంగా అమలు చేస్తూ వున్నాడని పరిపాలనాదక్షుడని, చంద్రబాబునాయుడుకి పేరు వచ్చిఉన్నందున కొంత అహంభావంతో కూడిన వైఖరికూడ తోడయ్యింది. పర్యవసానంగా 2001 లో కె.సి.ఆర్. తె.దే.పా నుండి బయటకు వెళ్ళి తెలంగాణా రాష్ట్రీయ సమితిని ఏర్పాటు చేశారు. కె.సి.ఆర్ వాక్చాతుర్యం కల వ్యక్తి. తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు రాజకీయ శిక్షణా తరగతులలో అధ్యాపకునిగా కూడ వ్యవహరిస్తూ ఉండేవారు. తెలుగుదేశం పాలనలో రాష్ట్ర అభివృద్ధిని చక్కగా విశదీకరిస్తూ ఉండేవారు. టి.ఆర్.ఎస్. పార్టీ పెట్టిన తర్వాత తెలంగాణా

ప్రాంతానికి అన్యాయం జరిగిందని, అభివృద్ధి చెందక పోవడానికి ఆంధ్రప్రాంతానికి చెందినవారే కారణమని ప్రచారం చేశారు.

**ప్రజా శ్రేయస్సు కన్నా అధికారం మిన్న:**

ఈ దశలో తెలుగుదేశం పార్టీని 2004 ఎన్నికల్లో అధికారం నుండి దింపి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలనే లక్ష్యంలో భాగంగా అనాడు పి.సి.సి. అధ్యక్షునిగా ఉన్న రాజశేఖర రెడ్డి గారు తెలంగాణా ప్రాంతానికి చెందిన 41 మంది కాంగ్రెస్ శాసన సభ్యులను ఢిల్లీకి పంపి తమకు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరచాలని, అందుకొరకు ఉద్యమాన్ని ప్రారంభించడానికి అనుమతి ఇవ్వమని కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న సోనియా గాంధీకి విజ్ఞప్తి చేయించారు. 1973 దరిమిలా ప్రశాంతంగా మన రాష్ట్రంలో పరిపాలన సాగిపోతూ ఉండగా, ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ముందుకు తెచ్చింది కాంగ్రెస్ పార్టీయే. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'జై కాంగ్రెస్ - జై తెలంగాణా' నినాదాన్ని ఇచ్చింది. ఆ ఎన్నికల్లో టి.ఆర్.ఎస్ పార్టీ కూడా పోటీ చేసింది. స్థానికసంస్థల ఎన్నికల్లో కొద్దిమేరకు ఫలితాలను సాధించి నిజామాబాద్ జిల్లా పరిషత్‌స్థానాన్ని మాత్రం కైవసం చేసుకొంది. 2002 డిసెంబరులో నల్గొండలో తెలంగాణా కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరం సభ్యులు సమావేశమై ప్రత్యేక తెలంగాణా సాధన అంశం కాంగ్రెస్ ఎజెండాలో ఉందని అందుకొరకు తమ పార్టీ కృషి చేస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సి.డబ్ల్యు.సి సమావేశంలో చిన్నరాష్ట్రాల ఏర్పాటును కోరుతూ, తీర్మానించి తెలంగాణా రాష్ట్రానిన ఏర్పాటు చేయాలని అప్పటి వాజపేయి గారు ప్రభుత్వానికి లేఖను పంపారు. ఆనాడు హోమంత్రిగా ఉన్న ఎల్.కె.అద్వానీ గారు ఉత్తరాఖండ్, చత్తీస్‌ఘర్, జార్ఖండ్ రాష్ట్రాలు అంతకు ముందు ఆయా రాష్ట్ర రాజధానులకు దూరంగా ఉండటం మరియు ఆ ప్రాంతాలలో ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నందున ఆ రాష్ట్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తెలంగాణా ప్రాంతంలోని రాజధాని నగరమైన హైదరాబాద్ ఉన్నందున తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయటం సాధ్యపడదని తమ లేఖ ద్వారా తెలియపరచారు.

2004 ఎన్నికల్లో కె.సి.ఆర్ తో కాంగ్రెస్ పొత్తుపెట్టుకొంది, తెలంగాణా

ప్రజల మనోభావాలను గమనించుతూ ఉన్నట్లు విదర్భ, తెలంగాణా ప్రాంతాల ప్రజల ఆకాంక్షలను గమనించి, రెండవ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌ను నియమించి ఆ అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. 2004 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. కాంగ్రెస్ పార్టీ నేరుగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఇస్తామన్న వాగ్దానం చేయలేదని, రెండవ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌ను వేసి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర డిమాండ్‌ను పరిశీలిస్తామని మాత్రమే పేర్కొన్న పత్రముపైన ఆనాడు టి.ఆర్.యస్. నాయకులు ఆలే నరేంద్ర సతకం చేసారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యు.పి.ఏ – 1 ప్రభుత్వం తన జాతీయ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ 2004 లో "తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కొరకు ఉన్న డిమాండ్‌ను అవసరమైన పరిశీలన మరియు ఏకాభిప్రాయ సాధనల తదుపరి సరైన సమయంలో యు.పి.ఏ ప్రభుత్వం పరిశీలించుతుంది" అని పేర్కొంది. జూన్ 7, 2004 న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి గారు కావించిన ప్రసంగంలో "తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కొరకై ఉన్న డిమాండ్‌ను అవసరమైన వారందరితో చర్చించి సరైన సమయంలో పరిశీలించడం జరుగుతుంది" అని పేర్కొన్నారు. 2004 లో ప్రత్యేక తెలంగాణా అంశాన్ని పరిశీలించడానికి రఘువంశీ ప్రసాద్ సింగ్, దయానిధి మారన్ సభ్యులుగా ప్రణబ్‌ముఖర్జీ అధ్యక్షులుగా కమిటీని నియమించడం జరిగింది.

**తె.రా.స వలననే కాంగ్రెస్ గెలవలేదు:**

చంద్రబాబు నాయుడు గారి 9 సం॥ పాలనలో 7సం॥లు సకాలంలో వర్షాలు పడక దుర్భిక్షం వలన పలుప్రాంతాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. 1989లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్పుచేసిన- 2 రూ. కిలో బియ్యం పథకాన్ని, హార్స్ పవర్ 50 రూ.ల విద్యుత్తు సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని హామీయిచ్చి ఎన్.టి.రామారావు గారు 1994లో అధికారంలోకి వచ్చి దాన్ని అమలుచేశారు. అప్పట్లో ప్రముఖ ఆర్థిక వేత్త రంగరాజన్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా వున్నారు "రంగరాజన్ గారి సలహాలు, ప్రపంచబ్యాంక్ సూచించిన సంస్కరణలను సమర్థవంతంగా వేగంగా అమలు చేస్తూ వున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు" అనే కీర్తిని పొందాలనే

భావనలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందచేస్తూ వున్న బియ్యం ధరను రూ.2 నుండి 3-50కు, తర్వాత రూ 5-25 కు మార్చారు. వ్యవసాయ విద్యుత్ టారిఫ్ హార్స్‌పవర్‌కు 50 రూ. నుండి 250 రూ. లకు పెంచారు. కొన్ని కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను స్పిన్నింగ్ మిల్లులను ప్రవేటీకరించడం వల్ల ప్రజలలో కొంత వ్యతిరేకభావం పెంపొందింది. దానికి తోడు గృహవిద్యుత్ ఛార్జీలు, వ్యవసాయ విద్యుత్ ఛార్జీలను పెంచిన అంశాన్ని ప్రతిపక్షాలు విపరీతంగా ప్రచారం చేశాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టి.ఆర్.ఎస్‌తోనే కాక ఉభయ కమ్యూనిష్టు పార్టీలతోను పొత్తు పెట్టుకొన్నందు వల్ల తెలుగుదేశం పరాజయంపాలైంది. "ఉచిత విద్యుత్తు" హామీతో పాటు తెలుగుదేశం పార్టీ పట్ల వ్యతిరేకత, సుదీర్ఘ పాదయాత్ర వలన రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి వచ్చారు.

**గోబెల్స్ ప్రచారం:**

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత, ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే అంతకు ముందు అనేక రంగాలలో వెనుకబడి ఉన్న తెలంగాణా ప్రాంతంలో గణనీయమైన పురోభివృద్ధి జరిగింది. 35 సం॥ల కాంగ్రెస్ పాలనలో, 15 సం॥ల తెలుగుదేశం పాలనలో ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందింది. కె.సి.ఆర్ తెలుగుదేశం పార్టీ నుండి బయటకు వెళ్ళి టి.ఆర్.యస్. పార్టీ పెట్టి, తెలంగాణా చాలా వెనుకబడి ఉందని, ఆంధ్ర పాలకులు తెలంగాణా ప్రాంతం పట్ల వివక్షతో వ్యవహరించారని, తెలంగాణాకు రావలసిన నదీ జలాలను ఆంధ్రావారు తరలించుకుపోయారని, ఆంధ్ర ప్రాంతం వారు దోపిడీదారులని అదే పనిగా ప్రచారం చేస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభలో జూలై 16, 1996 న తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కె.చంద్రశేఖరావు మాట్లాడుతూ ఆరు సూత్రాల పథకం, జోనల్ విధానాల వల్ల రాష్ట్రం చాలా నష్టపోతూ ఉందన్నారు. ఒక ప్రాజెక్టు వద్ద ఉద్యోగులు మిగులుగా ఉంటే, వేరే ప్రాజెక్టుకు వారిని బదిలీ చేసి, అక్కడ వారి సేవలు ఉపయోగించుకొనే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలన్నారు.

ఫిబ్రవరి 26, 1997 న రాష్ట్ర శాసన సభలో మాట్లాడుతూ దామోదర

రెడ్డి అనే శాసన సభ్యుడు " "రాయలసీమ విమోచన సమితి", "తెలంగాణా ప్రజా సమితి" వంటి సంస్థలను స్థాపించి, ప్రత్యేక రాష్ట్రాలను కోరిన రాజకీయ నాయకులు, తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేరిన తర్వాత ఆ ఉద్యమాలను విస్మరించారు." అని తన ప్రసంగం ముగిస్తూ "జై తెలంగాణా" అన్న నినాదాన్ని ఇచ్చారు. తరువాత కె.సి.ఆర్ మాట్లాడుతూ, "ఇటువంటి నినాదాలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను" అన్నారు.

ఆగష్టు 22, 1988 న తెలుగుదేశం శాసనసభ్యులు డా॥ నాగం జనార్ధన రెడ్డి గారు మాట్లాడుతూ "1969 - 71 ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో 350 మంది పౌరులు, ఎక్కువ మంది యువకులు ప్రాణాలు కోల్పోయారని, ఏమి సాధించారని అడిగారు. మేము జైలుపాలై రెండున్నర సం॥లు చదువు కోల్పోయాం. చెన్నారెడ్డి గారు మాత్రం ముఖ్యమంత్రి అయ్యారు.రాష్ట్రం సమైక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని నేను నమ్ముతున్నాను" అన్నారు.

మార్చి 29, 2005 న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ "47 ఏళ్ళ క్రితం 1956 లో వివాహం జరిగింది, దంపతులకు బిడ్డలు, బిడ్డలకు బిడ్డలు కలిగారు. ఇప్పుడు విడాకులు గురించి మాట్లాడుతూ ఉన్నారు. వృద్ధ దంపతులను విడదీయటానికి మీరు ప్రయత్నిస్తున్నారా?" అని ప్రత్యేక తెలంగాణా వాదులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విధంగా తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి పదవులలో ఉండి, రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని వాదించిన పెద్దలే ఇప్పుడు ప్రత్యేక తెలంగాణాను బలంగా కోరడంలోని ఆంతర్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి.

ఆ సమయంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో సాధించిన ప్రగతిని విశదీకరిస్తూ వాస్తవ పరిస్థితులను గణాంక వివరాలతో సహా విస్తృతంగా ప్రజలలోకి తీసుకొని వెళ్ళి ఉండగలిగినట్లయితే తెలంగాణా ప్రాంతంలో

టి.ఆర్.యస్.కు బలం చేకూరేది కాదు. తెలంగాణా ప్రాంతానికి చెందిన తెలుగుదేశం మంత్రులు పట్టుదలతో ఆ పని చేయకపోగా, అడపా దడపా వారు కూడా తెలంగాణా ప్రాంతం వెనుకబడి ఉందని మాట్లాడుతూ ఉండటం జరిగింది. కాంగ్రెస్ నాయకులు కూడా అదే రీతిలో మాట్లాడుతూ ఉండటం వలన తెలంగాణా సామాన్య ప్రజానీకంలో తాము వెనుకబడి ఉన్నామన్న భావన కొంతమేరకు ఏర్పడింది.

**బలహీనపడిన తె.రా.స:**

ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు దిశగా అవసరమైన చర్యలు ఏవీ కేంద్ర ప్రభుత్వం తీసుకోకపోవడంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి సెప్టెంబర్ 2006 లో టి.ఆర్.యస్. వైదొలిగింది. టి.ఆర్.యస్. కు చెందిన నలుగురు పార్లమెంట్ సభ్యులు, 16 మంది శాసనసభ సభ్యులు మార్చి 2008 లో తమ సభ్యత్వాలకు రాజీనామాలు సమర్పించారు. మే 2008 లో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు తెలంగాణా ప్రజాభీష్టంపైన రిఫరెండం (ప్రజాభిప్రాయం ) అని, కాబట్టి టి.ఆర్.యస్ ను సపోర్ట్ చేయాలని ఉధృతంగా ప్రచారం చేసారు. కాని కేవలం 2 పార్లమెంట్ స్థానాలలో, 7 అసెంబ్లీ స్థానాలలో మాత్రమే టి.ఆర్.యస్. గెలిచింది. తర్వాత కాంగ్రెస్ నాయకుడు, ఆర్.టి.సి ఛైర్మెన్‌గా ఉన్న ఎమ్.సత్యనారాయణరావు విసిరిన ఛాలెంజికి కె.సి.ఆర్ మళ్లీ పార్లమెంట్ సభ్యాత్వానికి రాజీనామా చేశారు. ఉపఎన్నికలో 15,000 మెజార్టీతో మాత్రమే చంద్రశేఖర్‌రావు గెలిచారు. అంటే ప్రజలలో పత్యేక తెలంగాణా భావన తగ్గుముఖంలో ఉందనడానికి ఇది నిదర్శనం.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో తె.రా.స. ఒక్క స్థానంలో కూడా పోటీ చేయలేదు. 2009 జనవరి 31న తెలుగుదేశం వామపక్షాలతో కూడిన మహాకూటమిలో టి.ఆర్.ఎస్. పార్టీ చేరుతున్నట్లు కె.సి.ఆర్ ప్రకటించారు. 2004 లో జరిగిన ఎన్నికలలో 26 స్థానాలలో గెలిచిన టి.ఆర్.ఎస్. 2009 ఎన్నికలలో 45 సీట్లకు పోటి చేసి 10 స్థానాలలో మాత్రమే గెలిచింది. 2004 ఎన్నికలలో ఐదుగురు టి.ఆర్.ఎస్. ఎం.పి.లు గెలువగా, 2009 లో ఇద్దరు మాత్రమే గెలిచారు. 2000 సం॥ నుండి ప్రత్యేక తెలంగాణా

అంశానికి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ 2009 ఎన్నికల ప్రణాళికలో ప్రత్యేక తెలంగాణా అంశాన్ని ఎక్కడా ప్రస్థావించకపోవడం గమనార్హం.

2008 లో తెలుగుదేశం పార్టీ నుండి దేవేంద్రగౌడ్ బయటకు వెళ్ళి "నవతెలంగాణా" పార్టీ ఏర్పరచారు. దానితో కొంత ఆందోళన చెందిన చంద్రబాబునాయుడు గారు–ఐదుగురు సభ్యులతో ప్రత్యేక తెలంగాణా అంశాన్ని పరిశీలించడానికి కమిటీని వేశారు.ఇది చాలా తీవ్రమైన పరిణామాలకు దారి తీయగల అంశం. రాష్ట్ర రాజధాని, నీళ్ళపంపకం, నిధుల పంపకం ఉద్యోగుల వ్యవహారాలు మొ॥ ఎన్నో కీలక అంశాలు కూడి ఉన్నాయి. వీటిని కనీసం పార్టీలో అన్ని ప్రాంతాలవారితో మాట్లాడకుండానే తెలుగుదేశం పార్టీ ప్రధానంగా తెలుగు ప్రజల ఆత్మాభిమానానికి ప్రతీకగా, తెలుగుజాతి సర్వతోముఖ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఎన్.టి.రామారావు గారు ఏర్పరచిన పార్టీ మౌలిక ఆశయాలకు విరుద్ధంగా వెళ్తున్నామనే భావన కూడ లేకుండా కొద్దిమంది ముఖ్యులతో కూడిన పొలిట్‌బ్యూరోలో ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానం చేశారు. ఆ తీర్మానం కాపీని ప్రణబ్ కమిటీకి 2008 లో తెలుగుదేశం పంపించింది.

**తె.దే.పా చారిత్రక తప్పిదం:**

"తెలుగు జాతి మనది నిండుగ వెలుగుజాతి మనది.
తెలంగాణా నాదీ, రాయలసీమ నాదీ,
సర్కారు నాది, నెల్లూరు నాది,
అన్నీ కలిసిన తెలుగు నాడు మనదే మనదే మనదేరా ...
॥తెలుగు జాతి॥
ప్రాంతాలు వేరైనా, మన అంతరంగమొకటేనన్నా ...
యాసలు వేరుగా ఉన్నా మన భాష తెలుగు భాషన్నా ..
వచ్చిండన్నా వచ్చాడన్నా ..... వరాల తెలుగు ఒకటేనన్నా
॥తెలుగు జాతి॥
స్వరాజ్య సిద్ధి జరిగిన పిమ్మట స్వరాష్ట్రమును సాధించాము.
జై విశాలాంధ్ర

దేశ భక్తిలో తెలుగువారికి ధీటే లేదనిపించాము.

॥తెలుగు జాతి॥

ఇంటిలోన అరమరికలు ఉంటే ఇల్లెక్కి చాటాలా?
కంటిలో నలక తీయాలంటే కనుగుడ్డు పెరికి వేయాలా?
పాలు పొంగు మన తెలుగు గడ్డను పగులకొట్టవద్దు
నలుగురిలో మన జాతి పేరును నవ్వుల పాలు చేయ్యొద్దు.

॥తెలుగు జాతి॥

తెలంగాణా మనదీ, రాయలసీమ మనదీ,
సర్కారు మనది, నెల్లూరు మనది,
అన్నీ కలిసిన తెలుగు నాడు మనదే మనదే మనదేరా ...'.

॥తెలుగు జాతి॥

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న రోజుల్లో నటసార్వభౌమ ఎన్.టి.రామారావు గారు తాను నిర్మించిన "తల్లా? పెళ్ళామా?" చిత్రంలో తెలుగు జాతిని చీల్చడం సరికాదని, కలసి ఉంటేనే ప్రగతి సాధ్యమని, అందరూ అభివృద్ధి చెందుతారని ఇచ్చిన సందేశం ఇప్పటికీ మరువలేము. అటువంటిది ప్రత్యేక తెలంగాణాకు అనుకూలంగా తెలుగుదేశం పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం అతి పెద్ద చారిత్రక తప్పిదం.

2009 ఎన్నికలకు ముందు వ్యూహాత్మకంగా తెలంగాణా అంశాన్ని పరిశీలించడానికి రోశయ్య కమిటీని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఏర్పరచింది. ఆ కమిటీ అసలు పని ప్రారంభించనేలేదు.

**హైదరాబాద్ ఫ్రీజోన్ –సుప్రీమ్ కోర్టు తీర్పు–పరిణామాలు:**

2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఉభయకమ్యూనిష్టులతోనే కాక టి.ఆర్.ఎస్ పార్టీతో కూడ పొత్తుపెట్టుకొంది. ఎన్నికలలో తిరిగి కాంగ్రెస్ విజయాన్ని సాధించింది రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యారు. 2009 సెప్టెంబరు 21 న రాజశేఖరరెడ్డి గారు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణానంతరం రోశయ్య గారు ముఖ్యమంత్రి అయ్యారు. 2009 అక్టోబర్ 9 న సుప్రీమ్ కోర్టు హైదరాబాదు సిటీ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని

పోలీసు ఉద్యోగాలు 6వ జోన్‌లో కాకుండా రాష్ట్ర పతి ఉత్తర్వులలోని 14ఎఫ్ క్లాజు ప్రకారం ఫ్రీ జోన్‌గా పరిగణించవలసి వుంటుందని తీర్పు ఇచ్చింది. "హైదరాబాద్ ఫ్రీ జోన్" అని పత్రికలు బ్యానర్ హెడ్‌లైన్స్ పెట్టాయి. ఎలక్ట్రానిక్ మీడియా కూడా విశేషమైన ప్రచారాన్ని కావించింది. ఈ అంశం కేవలం కొద్ది మంది సిటీ పోలీస్ కమీషనరేట్ ఉద్యోగాలకు తప్ప వేరే వాటికి సంబంధించినది కాదు అని సరైన వివరణ ప్రజలకు ఇవ్వకపోవటం వలన తెలంగాణా యువతలో నిరుద్యోగులలో ఆందోళన కలిగింది.

కొంత నిస్పృహతో ఉన్న కె.సి.ఆర్.కు సుప్రీంకోర్టు తీర్పు సాకుగా లభించింది. ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు ఏ విధమైన చర్యలను ప్రభుత్వం తీసుకోనందుకు నిరసనగా 2009 నవంబర్ నెలాఖరునుండి నిరవధిక నిరాహార దీక్షకు ఉపక్రమించనున్నట్లు కె.సి.ఆర్ భారత రాష్ట్రపతికి లేఖ రాశారు. 2009 నవంబర్ 29 న ఖమ్మంలో దీక్షను ప్రారంభించారు. 24 గం.లు గడవక ముందే చిరుదరహాసంతో నిమ్మరసం తీసుకొని దీక్ష ఉపసంహరిస్తూ ఉన్న దృశ్యం ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు కన్పించింది. దానితో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఆగ్రహించి కె.సి.ఆర్ ను ఉద్యమ ద్రోహిగా దూషించారు. " లేదు, నేను దీక్ష కొనసాగిస్తున్నాన"ని మళ్ళీ ప్రకటించారు. రోశయ్య ప్రభుత్వం కె.సి.ఆర్ ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, హాస్పిటల్ లో "టోటల్ పేరెంటల్ న్యూట్రిషన్" అందిస్తూ వచ్చింది. దీని ద్వారా ఒకవ్యక్తి ఎన్నిమాసాలైనా జీవించవచ్చు. ఆ సమయంలో కె.కేశవరావు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఉన్నాడు. జార్ఖండ్ రాష్ట్రానికి ఎన్నికలు జరుగనున్నాయి. దానికి కె.కె. కాంగ్రెస్ పార్టీ తరపున పరిశీలకుడిగా ఉన్నారు. అభ్యర్థుల నిర్ణయం వంటి వ్యవహారంపై తరచుగా కాంగ్రెస్ అధ్యక్షురాలిని కలుసుకుంటూ ఉండే అవకాశాన్ని ఉపయోగించుకొంటూ, హైదరాబాద్‌లో కె.సి.ఆర్ ఆమరణ నిరాహార దీక్ష తీవ్రమైన పరిస్థితులకు దారితీస్తుందని, కె.సి.ఆర్‌కు ప్రాణ నష్టం జరిగితే హైదరాబాద్‌లో పెద్దఎత్తున విధ్వంసకాండ చెలరేగవచ్చునీ, పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరగవచ్చు అనే భావాన్ని సోనియాగాంధీకి కల్పించారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ ఇంటిలిజెన్స్

శాఖ కూడా కె.సి.ఆర్ దీక్ష వలన కలిగే పరిస్థితులను అతిగా అభివర్ణించి కేంద్రానికి నివేదిక ఇచ్చింది.

డిసెంబర్ 6, 7 తేదీలలో పలుచోట్ల హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఉస్మానియా, కాకతీయ యూనీవర్శిటీల విద్యార్థులు జాయింట్ యాక్షన్ కమిటీని స్థాపించి ఉద్యమాన్ని ఉధృతం చేసారు. "కె.సి.ఆర్ నిరాహార దీక్ష – అనంతర పరిణామాలు" అంశంపై చర్చించడానికి ముఖ్యమంత్రి రోశయ్య డిసెంబర్ 7వ తేదీన అఖిలపక్ష సమావేశానికి పిలిచినప్పుడు సి.పి.ఐ., బి.జె.పి., తెలంగాణాకు అనుకూలంగానూ, కేంద్రం తెలంగాణాను ప్రకటిస్తే తమకు అభ్యతరం లేదని తెలుగుదేశం పార్టీ, ప్రజారాజ్యం పార్టీలు తమ అభిప్రాయాన్ని చెప్పాయి. సి.పి.యం సమైక్య రాష్ట్రాన్ని కొనసాగించాలని కోరింది.యం.ఐ.యం. కూడా రాష్ట్రాన్ని సమైక్యంగా కొనసాగించాలని, శాసనసభలో ఈ అంశంపైన చర్చ జరగాలని కోరింది. ఈ సమాచారాన్ని ఢిల్లీకి రోశయ్య తెలియపర్చగా సోనియాగాంధీ ఆదేశం మేరకు కేంద్ర హోమ్‌మంత్రి చిదంబరం డిసెంబర్ 9వ తేదీ అర్ధరాత్రి తెలంగాణా ప్రత్యేకరాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతోందని ప్రకటిస్తూ, రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ఇందుకు అనుగుణంగా ఒక తీర్మానం ప్రవేశపెడతారని ప్రకటించారు. చిదంబరం ప్రకటనతో తెలంగాణా రాష్ట్రం వచ్చేసింది అన్న భావన తెలంగాణా ప్రజలలో కలిగింది. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు కూడా తెలంగాణా వచ్చేసినట్లే అనే విధంగా సంబరాలు చేసుకోవటం వలన సామాన్యులలో ఈ అభిప్రాయం బలపడింది.

**దిక్కులు పిక్కటిల్లిన సమైక్య నినాదం:**

10వ తేదీ ఉదయం నుండి సీమాంధ్ర ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహజ్వాలలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రమంత్రులు, పార్టీలకతీతంగా 9మంది పార్లమెంటు సభ్యులు, 143 మంది శాసన సభ్యులు, 41 మంది శాసన మండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా సీమాంధ్ర ప్రాంతం దద్దరిల్లింది. ముఖ్యమంత్రి రోశయ్య 'శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టలేన' ని తన నిస్సహాయతను వ్యక్తం చేసారు. డిసెంబర్ 10 నుండి

రాష్ట్రంలోని పరిస్థితులలో చాలా మార్పులు కనిపిస్తూ ఉన్నాయని అన్ని రాజకీయ పక్షాలతో చర్చించి ఏకాభిప్రాయసాధనకు కృషి చేయవలసి వుంటుందని, దాని తర్వాతే ఏదైనా నిర్ణయం తీసుకోవలసివుంటుందని చిదంబరం డిసెంబర్ 23న ప్రకటిచారు. 2010 జనవరి 5వ తేదీన ఢిల్లీలో తెలంగాణా అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్, తె.దే.పా., ప్రజరాజ్యం,పార్టీల తరుపున ఇద్దరేసి ప్రతినిదులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఇరుప్రాంతల వారు తమ ప్రాంతాల పక్షాన అభిప్రాయాలు వ్యక్తంచేశారు. సి.పి.ఐ, బి.జె.పి లు తెలంగాణకు అనుకూలంగానూ, సి.పి.యమ్, యమ్.ఐ.యమ్ పార్టీలు సమైక్యతకు అనుకూలంగానూ తమ అభిప్రాయాలను తెలియపరచారు. దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ పెద్దది. మన రాష్ట్ర విభజన జరిగితే తమిళనాడు పెద్ద రాష్ట్రం అవుతుంది. తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకొనడానికి చిదంబరానికి చక్కని అవకాశం లభిస్తుంది. సోనియా గాంధీ గారి పుట్టిన రోజు కానుకగా చిదంబరం చేసిన ప్రకటన రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు రేపింది.

రాష్ట్రంలో నెలకొని ఉన్న పరిస్థితులను పరిశీలించడానికి, కేంద్ర ప్రభుత్వం 'శ్రీ కృష్ణకమిటీ'ని జనవరి 28, 2010న నియమించింది. 2010 డిసెంబర్ 31 వ తేదీ లోపల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొని ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి అన్ని ప్రాంతాల వారితో, వర్గాల వారితో చర్చించి పరిస్థితులను చక్కదిద్దడానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధనకు అనుసరించవలసిన వ్యూహాన్ని, కార్యాచరణ ప్రణాళికను సూచించవలసిందని, కమిటీని ప్రభుత్వం కోరింది. జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సందర్శించింది. ప్రజాప్రతినిధులతో, స్వచ్ఛంద సంస్థలతో వివిధ వర్గాలతో చర్చించి అభిప్రాయ సేకరణ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖల నుండి 1956 నుండి నేటి వరకు మూడు ప్రాంతాలలోనూ సాధించిన ప్రగతిని, అందుకు వినియోగించిన నిధులను, మొ॥ అంశాలన్నిటికి సంబంధించి గణాంక వివరాలతో సహా సమాచారాన్ని రాబట్టింది. ప్రత్యేకంగా జలవనరులకు సంబంధించిన నిపుణులతో కూడ ఒక సబ్ కమిటీని వేసి అభిప్రాయ సేకరణ చేసింది. న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో 22 జూన్ 2010న శ్రీకృష్ణకమిటీ జల

వనరుల సబ్ కమిటీ ముందు హాజరై, ఆంధ్రప్రదేశ్ విభజన జరిగితే కృష్ణా గోదావరీజలాల పైన ఆధారపడిన ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని లక్షలాది రైతులు తీవ్రనష్టానికి గురవుతారని, దాని వలన ఈ ప్రాంతంలో ఆర్థిక, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రగతికి, అభివృద్ధి ఉపాధి అవకాశాలకు విఘాతం కలుగుతుందని లక్షలాది టన్నులు ఆహారధాన్యాల ఉత్పత్తికి గండిపడుతుందని వివరణాత్మకంగా లిఖితపూర్వకమైన విజ్ఞప్తి పత్రాన్ని రైతాంగ సమాఖ్య సభ్యులు అందజేశారు. శ్రీకృష్ణకమిటీ అన్ని కోణాలలో ప్రత్యేక తెలంగాణా అంశాన్ని నిశితంగా పరిశీలించి, విశ్లేషించి రిపోర్టును డిసెంబర్ 30, 2010 న అందచేసింది. అంతకుముందు విద్య, వైద్య, రహదార్లు, విద్యుత్, రవాణా మొ॥ అనేక రంగాలలో ఎంతో వెనుకబడివున్న తెలంగాణా ప్రాంతం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన దరిమిలా గణనీయమైన ప్రగతిని సాధించిందని, తెలంగాణాలోని మెహబూబ్‌నగర్, రాయలసీమలో అనంతపురం, ఉత్తర కోస్తాలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే వెనుకబడి వున్నాయిని పేర్కొన్నారు.

**శ్రీకృష్ణ కమిటీ సూచనలు:** స్థానిక, ప్రాంతీయ, జాతీయ కోణాలలో అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన పిదప శ్రీకృష్ణ కమిటీ ఈ క్రింది పరిష్కార మార్గాలను, సాధ్యమయ్యే అవకాశాలను సూచించింది.

**1. యథాతథ స్థితిని కొనసాగించడం:** తెలంగాణా ప్రాంతంలో ఆందోళనలు కొనసాగుతాయని, హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాలలోని ప్రజల సాధారణ జీవన పరిస్థితులపై దాని ప్రభావం పడుతుందని, హైదరాబాద్ నగర ఆర్థిక అభివృద్ధి కుంటుపడుతుందని, మావోయిస్టుల ప్రాబల్యం పెరుగుతుందని కమిటీ అభిప్రాయ పడింది. తెలంగాణా ప్రాంత అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఉండలేదని కమిటీ భావించింది. అయితే తెలంగాణా ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టకుండా కేవలం యథాతథ స్థితిని కొనసాగించడం వలన ప్రయోజనం ఉండదని కమిటీ అభిప్రాయ పడింది.

2. హైదరాబాద్ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా కొనసాగిస్తూ, సీమాంధ్ర, తెలంగాణాలుగా రాష్ట్రాన్ని విభజించి రానున్న కాలంలో ఆ రాష్ట్రాలు రెండూ తమ తమ రాజధానులను అభివృద్ధి చేసుకొనే దిశగా చర్యలు చేపట్టడం: ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో హైదరాబాద్ నగరానికున్న గుర్తింపు, ఐ.టి, ఐ.టి. ఆధారిత సేవల విషయంలో హైదరాబాద్ నగరానికున్న గుర్తింపును, ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఈ సూచనను పరిశీలించవలసి ఉంది. హైదరాబాద్ నగరం, సమీప జిల్లాలలో వందలాది పరిశ్రమలు అభివృద్ధి అవడం వల్ల, బయటి రాష్ట్రాల నుండి వచ్చిన వారితో సహా, మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలనుండి వచ్చిన వారు హైదరాబాద్ నగర జనాభాలో మూడవ వంతుకు పైగా ఉన్నారు. సీమాంధ్ర తెలంగాణా రెండు రాష్ట్రాలు కొంత కాలం పాటు హైదరాబాద్ నగరంలోనే తమ రాజధానులను కొనసాగించి తరువాత తమ తమ ప్రాంతాలలో రాజధానులను అభివృద్ధి చేసుకోవాలి. హైదరాబాద్ నగరం కేంద్ర పాలిత ప్రాంతంగా వున్నప్పుడు - అందులో నుండి వచ్చే ఆదాయం కేంద్ర ప్రభుత్వానికి వెళుతుంది. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం, తెలంగాణా, సీమాంధ్ర మూడు ప్రాంతాలకు అంగీకారయోగ్యమైన దామాషాలో నిధుల పంపకం జరుగుతుంది. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతం వారికి ఈ సూచన బహుశా అంగీకారయోగ్యమైనా, తెలంగాణా ప్రాంతం వారికి ఆమోదయోగ్యం కాకపోవచ్చు. అంతేకాక, సీమాంధ్ర ప్రాంతానికి, హైదరాబాద్ నగరానికి మధ్యలో - నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాలుండటం వలన కొన్ని సమస్యలు తలయెత్తవచ్చు. అందువలన ఈ మార్గం ఆచరణయోగ్యం కాదని కమిటీ అభిప్రాయపడింది.

3. హైదరాబాదుతో కూడిన రాయల తెలంగాణా, కోస్తా ఆంధ్రాలుగా రాష్ట్రాన్ని విభజించడం : రాయలసీమ ప్రాంతానికి చెందిన కొంతమంది, ఎమ్.ఐ.యం పార్టీ వారు రాష్ట్రంలో ఆర్థిక ప్రగతికి మైనారిటీ ముస్లిం ప్రజల సంక్షేమానికి రాష్ట్రాన్ని సమైక్యంగానే కొనసాగించడం ఉత్తమమని, ఒక వేళ విభజన అనివార్యమైతే, తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలను కలిపి ఒకటిగా చేయాలని సూచించి ఉన్నారు. అయితే హైదరాబాద్ నగరం పాతబస్తీకి వెలుపల ఉన్న

తెలంగాణా ప్రాంతానికి చెందిన అన్ని రాజకీయ పక్షాలు, గ్రూపులు - ఈ ప్రతిపాదనను చాలా తీవ్రంగా వ్యతిరేకించాయి. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలని కోరే వారు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తారు. అందువలన ఈ ప్రతిపాదన మూడు ప్రాంతాలలో వారికి కూడా ఆమోదయోగ్యంగా ఉండదు.

**4. నేషనల్ హైవే - 9 వెంట పాలేరు వరకు, నాగార్జున సాగర్ వరకు ఉన్న రాష్ట్ర రహదారి వెంట కృష్ణా నది వరకు నల్గొండ జిల్లాలో ఉన్న మండలాలను, జాతీయ రహదారి -7 వెంట తుంగభద్ర నది వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని మండలాలను కలిపి "బృహత్తర హైదరాబాద్ మెట్రోపాలిటన్ నగరాన్ని" కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంచి మిగతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సీమాంధ్ర, తెలంగాణా రాష్ట్రాలుగా విభజించడం :** లోగడ 175 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ హద్దులను 625 చ.కి.మీ లకు పెంచారు. హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) స్థానంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 7073 చ.కి.మీ. కూడిన 'విస్తరించబడిన హైదరాబాద్ మున్సిపల్ డెవలప్‌మెంట్ అథారిటీ' ఏర్పడింది. ఈ ప్రతిపాదన ద్వారా హైదరాబాద్ యూనియన్ టెరిటరీ విస్తీర్ణాన్ని 12,000 చ.కి.మీ.లకు పెంచాలని సూచించడం జరిగింది. ఇందులో 67 మండలాలు, 1330 గ్రామాలు ఉంటాయి. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో హైదరాబాద్ రాష్ట్రానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆధునిక సేవా రంగం, రవాణా రంగాల వాటా దాని స్థూల ఉత్పత్తిలో 1999 - 2000లో 43శాతం ఉండగా, 2005 - 2006 నాటికి 58 శాతానికి పెరిగింది. మన దేశం నుండి జరుగుతూ ఉన్న ఐ.టి. ఎగుమతులలో 15 శాతం వాటా హైదరాబాద్‌దే. ఇవేకాక మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్ కూడా చాలా ముఖ్యమైన అంశాలు. ఇటీవల కాలంలో ఉత్తర ఈశాన్య భారతాలనుండి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు హైదరాబాద్‌కు వస్తున్నారు. దేశానికి భౌగోళిక రీత్యా హైదరాబాద్ కీలకమైన నగరం. ఇవేకాక ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ప్రతిష్టాత్మక సంస్థలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇవి దేశంలో పలు ప్రాంతాల నుండి సమర్థత కలిగిన వారిని ఆకర్షించడమే కాక, దేశ

భద్రత దృష్ట్యా కూడా చాలా ముఖ్యమైనవి. కోస్తా ఆంధ్రా, రాయలసీమ, తెలంగాణా మూడు ప్రాంతాలకు కూడా ఈ విస్తరించబడిన మెట్రో పాలిటన్ హైదరాబాద్ భౌగోళికంగా కలిసి ఉంటుంది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం జరిగితే – ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా ముందుకు వచ్చే అవకాశం ఉంది. అటువంటప్పుడు కూడా 3 రాష్ట్రాల వారు ఈ హైదరాబాద్ యు.టి. లో తమ రాజధానులను కొనసాగించుకొగలిగే వీలు కూడా ఉంటుంది. ఢిల్లీకి వలే హైదరాబాద్ యు.టి.కి లెజిస్లేచర్ అసెంబ్లీ ఉండవచ్చు. చండీఘర్ సమీపంలో ఉన్న మొహల్లీ, పంచ్‌కూల పట్టణాలు అభివృద్ధి చెందినట్లు, ఢిల్లీకి సమీపంలో హర్యానాలోని గుర్‌గావ్, సోనేపట్, ఫరీదాబాద్ పట్టణాలు, ఉత్తర ప్రదేశలోని ఘజియాబాద్, నోయిడా పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందిన విధంగా ఇక్కడ హైదరాబాద్ యు.టి. సమీపంలోని పట్టణాలు కూడా బాగా అభివృద్ధి చెందుతాయి. కేంద్ర పాలిత ప్రాంతం నుండి పన్నులన్నీ కేంద్ర ప్రభుత్వానికి వెళతాయి. కొత్తగా ఏర్పడే 3 రాష్ట్రాలకు యు.టి. నుంచి లభించే ఆదాయం ప్రాతిపదికగా గ్రాంటులను కేంద్రం సమకూరుస్తుంది. కొన్ని కోణాలలో ఇది మంచి ప్రత్యామ్నాయం అయినప్పటికీ అందరినుండి రాజకీయ ఏకాభిప్రాయ సాధన కష్టమవుతుంది. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతం నుండి వ్యతిరేకతం వచ్చే అవకాశం ఉంది.

**5. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణాను, సీమాంధ్రకు వేరే రాజధానిగా రాష్ట్రాన్ని విభజించడం:** తాత్కాలికంగా కొంత కాలం పాటు సీమాంధ్ర రాజధానిని కూడా హైదరాబాద్ లో కొనసాగిస్తూ వేరే రాజధానిని ఏర్పాటు చేసుకోవలిసి ఉంటుంది. నూతన రాజధాని ఏర్పాటుకు అవసరమయ్యే పెట్టుబడిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చాలి. ఈ సూచన తెలంగాణా ప్రాంతం వారికి ఆమోదయోగ్యమైనప్పటికీ, రాయలసీమ, కోస్తా ఆంధ్రా ప్రాంతాలలో చాలా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుందని హైదరాబాద్ నగర ప్రతిపత్తి, నదీ జలాల పంపకం వంటి సమస్యల వలన సీమాంధ్ర ప్రాంతంలో ప్రజా ప్రతినిధులపైన, రాజీనామాలు చేసి సమైక్యాంధ్రప్రదేశ్ కొరకు పాటు పడాలని ఒత్తిడి వస్తుంది. తెలంగాణా ఏర్పాటు నిర్ణయం జరిగితే – వివిధ రాష్ట్రాలలో

ఆయా రాష్ట్రాలను విభజించి, కొన్ని కొత్త రాష్ట్రాలను ఏర్పరచాలని డిమాండ్‌లు ముందుకు వస్తాయని, పెద్ద ఎత్తున ఉద్యమాలు చెలరేగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. మావోయిస్టుల ప్రాబల్యం, మత ఛాందస వాదుల ప్రాబల్యం పెరగవచ్చని కమిటీ అభిప్రాయపడింది. అన్ని కోణాలలో పరిశీలించినప్పుడు ఇది అత్యుత్తమమైన పరిష్కారం కాదని, మూడు ప్రాంతాలలోని వారు ఏకగ్రీవంగా ఇందుకు అంగీకరిస్తే మాత్రమే విధిలేని పరిస్థితులలోనే రాష్ట్రాన్ని విభజించాలని సూచించింది.

**6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమైక్యంగానే ఉంచి, తెలంగాణాకు ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేయాలి : ఆ ప్రాంతీయ కమిటీకి చట్టబద్ధతను, అధికారాలను కల్పించి అవసరమైన నిధులను అందజేయాలి :** మూడు ప్రాంతాలలోని ప్రజల అభివృద్ధే అత్యంత ముఖ్యమని అందుకై లోతయిన విస్తృతమైన ఆర్థిక, రాజకీయ వికేంద్రీకరణ ద్వారా ఇది సాధించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. ఇతర ప్రత్యామ్నాయాలలో సూచనలను అనుసరించి, రాజధానులు, శాసనసభలు, మంత్రివర్గాలు, న్యాయస్థానాలు, పరిపాలనా సంస్థలు మొ॥ వాటిని అధిక సంఖ్యలో ఏర్పాటు చేయవలసి వచ్చి వాటిపైన చాలా హెచ్చు మొత్తంలో ప్రజాధనాన్ని ఖర్చు పెట్టవలసి ఉంటుందని, ఇలా చేయటం అనవసరమని కమిటీ భావించింది. రాష్ట్ర సమైక్యతే మూడు ప్రాంతాలకు ఉపయోగకరమని, తెలంగాణా ప్రాంత అభివృద్ధి కొరకు సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి, రాజ్యాంగ / చట్టబద్ధ చర్యలను తీసుకుంటూ రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని సూచించింది.

1956 లోని పెద్ద మనుష్యుల ఒప్పందం లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన నిధులను, అధికారాలను, కార్య నిర్వహణ యంత్రాగాలతో కూడిన చట్టబద్ధమైన తెలంగాణా ప్రాంతీయ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా దీనిని సాధించవచ్చని అభిప్రాయపడింది. ఎప్పుడైనా ఈ ప్రాంతీయ కౌన్సిల్ అభిప్రాయం రాష్ట్ర ప్రభుత్వం లేక శాసనసభలు శాసనపరమైన సమస్యల గురించి భేదాభిప్రాయాలు తలెత్తితే, గవర్నర్ అధ్యక్షతన ఉండే "ఎపెక్స్ కమిటీ" వద్ద పరిష్కరించుకోవచ్చని సూచించింది. స్థానిక పరిపాలన, హెచ్.యం.డి.ఏ.

పరిధిని మినహాయించి, పంచాయితీరాజ్ సంస్థలు, మునిసిపాలిటీలతో కూడిన స్థానిక పరిపాలన, విద్య, ఆరోగ్యం, జలవనరులు, ప్లానింగ్, ఆర్థిక అభివృద్ధి రాష్ట్ర ప్రణాళికలో భాగంగా - సబ్‌ప్లాన్ రూపొందించటం వంటి అంశాలు రీజినల్ కౌన్సిల్ పరిధిలోనికి వస్తాయి.

జాతీయ ప్రయోజనాలను మూడు ప్రాంతాలలో సాధిస్తూ వున్న ప్రగతి వేగాన్ని కొనసాగించడానికి ఈ సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రత్యామ్నాయాన్ని కమిటీ సూచించింది. సమర్థమైన రాజకీయ, పరిపాలనా నిర్వహణతో దానిని సాధించవచ్చని అభిప్రాయపడింది. పారిశ్రామిక మరియు ఐ.టి. బృహత్తర సముదాయంగా ఉన్న హైదరాబాద్ నగర భవిష్యత్తు పట్ల అనిశ్చిత పరిస్థితిని ఈ ప్రత్యామ్నాయం తొలగిస్తుంది. రాష్ట్రంలో అత్యధిక ప్రజానీకానికి, ఈ ప్రత్యామ్నాయం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని కమిటీ భావించింది.

జలవనరు నిర్వహణకు, సాంకేతిక నిపుణులతో కూడిన వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డును, ఇరిగేషన్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ను నియమించాలని కమిటీ కోరింది. ఈ ఏర్పాటు వలన తెలంగాణా ప్రాంత ప్రజలు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఈ ప్రతిపాదనకు - తెలంగాణా ప్రాంతం నుండి కొందరు రాజకీయ నాయకులు, వర్గాలు, సంస్థలు, కొంత మంది ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేయ్యొచ్చు. లక్షలాది ఉద్యోగాలు కొత్తగా వస్తాయని కొందరు చేసిన వాగ్దానాలను నమ్మిన విద్యార్థులు, నిరుద్యోగులు, త్వరత్వరగా ప్రమోషన్లు వస్తాయని ఆశించిన తెలంగాణా ప్రాంత ఎన్.జి.వో.లు, న్యాయవాదులు, రైతులు సంతృప్తి చెందక పోవటం వలన కొంత మేరకు ఉద్యమాలు కొనసాగవచ్చు. ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులపైన ఒత్తిడి కూడ రావచ్చు. రాష్ట్రం కలిసి సమైక్యంగా కొనసాగడం వలన చేకూరే ప్రయోజనాలను, తెలంగాణా ప్రాంతీయ కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఉపయోగాలను అర్థం చేసుకోగలిగితే, ఆందోళనలను ప్రభుత్వం నియంత్రించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రగతి దిశగా తీసుకు వెళ్ళగలుగుతుంది. తెలంగాణా కన్నా ఇంకా వెనుకబడి ఉన్న రాయలసీమ ప్రాంతం నుండి, ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రాంతం నుండి, గిరిజన ప్రాంతం నుండి కూడా తాము వెనుకబడి

ఆయా రాష్ట్రాలను విభజించి, కొన్ని కొత్త రాష్ట్రాలను ఏర్పరచాలని డిమాండ్‌లు ముందుకు వస్తాయని, పెద్ద ఎత్తున ఉద్యమాలు చెలరేగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. మావోయిస్టుల ప్రాబల్యం, మత ఛాందస వాదుల ప్రాబల్యం పెరగవచ్చని కమిటీ అభిప్రాయపడింది. అన్ని కోణాలలో పరిశీలించినప్పుడు ఇది అత్యుత్తమమైన పరిష్కారం కాదని, మూడు ప్రాంతాలలోని వారు ఏకగ్రీవంగా ఇందుకు అంగీకరిస్తే మాత్రమే విధిలేని పరిస్థితులలోనే రాష్ట్రాన్ని విభజించాలని సూచించింది.

**6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమైక్యంగానే ఉంచి, తెలంగాణాకు ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేయాలి : ఆ ప్రాంతీయ కమిటీకి చట్టబద్ధతను, అధికారాలను కల్పించి అవసరమైన నిధులను అందజేయాలి :** మూడు ప్రాంతాలలోని ప్రజల అభివృద్ధే అత్యంత ముఖ్యమని అందుకై లోతయిన విస్తృతమైన ఆర్థిక, రాజకీయ వికేంద్రీకరణ ద్వారా ఇది సాధించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. ఇతర ప్రత్యామ్నాయాలలో సూచనలను అనుసరించి, రాజధానులు, శాసనసభలు, మంత్రివర్గాలు, న్యాయస్థానాలు, పరిపాలనా సంస్థలు మొ॥ వాటిని అధిక సంఖ్యలో ఏర్పాటు చేయవలసి వచ్చి వాటిపైన చాలా హెచ్చు మొత్తంలో ప్రజాధనాన్ని ఖర్చు పెట్టవలసి ఉంటుందని, ఇలా చేయటం అనవసరమని కమిటీ భావించింది. రాష్ట్ర సమైక్యతే మూడు ప్రాంతాలకు ఉపయోగకరమని, తెలంగాణా ప్రాంత అభివృద్ధి కొరకు సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి, రాజ్యాంగ / చట్టబద్ధ చర్యలను తీసుకుంటూ రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని సూచించింది.

1956 లోని పెద్ద మనుష్యుల ఒప్పందం లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన నిధులను, అధికారాలను, కార్య నిర్వహణ యంత్రాంగాలతో కూడిన చట్టబద్ధమైన తెలంగాణా ప్రాంతీయ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా దీనిని సాధించవచ్చని అభిప్రాయపడింది. ఎప్పుడైనా ఈ ప్రాంతీయ కౌన్సిల్ అభిప్రాయం రాష్ట్ర ప్రభుత్వం లేక శాసనసభలు శాసనపరమైన సమస్యల గురించి భేదాభిప్రాయాలు తలెత్తితే, గవర్నర్ అధ్యక్షతన ఉండే “ఎపెక్స్ కమిటీ” వద్ద పరిష్కరించుకోవచ్చని సూచించింది. స్థానిక పరిపాలన, హెచ్.యం.డి.ఏ.

పరిధిని మినహాయించి, పంచాయితీరాజ్ సంస్థలు, మునిసిపాలిటీలతో కూడిన స్థానిక పరిపాలన, విద్య, ఆరోగ్యం, జలవనరులు, ప్లానింగ్, ఆర్థిక అభివృద్ధి రాష్ట్ర ప్రణాళికలో భాగంగా – సబ్‌ప్లాన్ రూపొందించటం వంటి అంశాలు రీజినల్ కౌన్సిల్ పరిధిలోనికి వస్తాయి.

జాతీయ ప్రయోజనాలను మూడు ప్రాంతాలలో సాధిస్తూ వున్న ప్రగతి వేగాన్ని కొనసాగించడానికి ఈ సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రత్యామ్నాయాన్ని కమిటీ సూచించింది. సమర్థమైన రాజకీయ, పరిపాలనా నిర్వహణతో దానిని సాధించవచ్చని అభిప్రాయపడింది. పారిశ్రామిక మరియు ఐ.టి. బృహత్తర సముదాయంగా ఉన్న హైదరాబాద్ నగర భవిష్యత్తు పట్ల అనిశ్చిత పరిస్థితిని ఈ ప్రత్యామ్నాయం తొలగిస్తుంది. రాష్ట్రంలో అత్యధిక ప్రజానీకానికి, ఈ ప్రత్యామ్నాయం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని కమిటీ భావించింది.

జలవనరు నిర్వహణకు, సాంకేతిక నిపుణులతో కూడిన వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డును, ఇరిగేషన్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ను నియమించాలని కమిటీ కోరింది. ఈ ఏర్పాటు వలన తెలంగాణా ప్రాంత ప్రజలు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఈ ప్రతిపాదనకు – తెలంగాణా ప్రాంతం నుండి కొందరు రాజకీయ నాయకులు, వర్గాలు, సంస్థలు, కొంత మంది ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేయ్యొచ్చు. లక్షలాది ఉద్యోగాలు కొత్తగా వస్తాయని కొందరు చేసిన వాగ్దానాలను నమ్మిన విద్యార్థులు, నిరుద్యోగులు, త్వరత్వరగా ప్రమోషన్లు వస్తాయని ఆశించిన తెలంగాణా ప్రాంత ఎన్.జి.వో.లు, న్యాయవాదులు, రైతులు సంతృప్తి చెందక పోవటం వలన కొంత మేరకు ఉద్యమాలు కొనసాగవచ్చు. ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులపైన ఒత్తిడి కూడ రావచ్చు. రాష్ట్రం కలిసి సమైక్యంగా కొనసాగడం వలన చేకూరే ప్రయోజనాలను, తెలంగాణా ప్రాంతీయ కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఉపయోగాలను అర్థం చేసుకోగలిగితే, ఆందోళనలను ప్రభుత్వం నియంత్రించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రగతి దిశగా తీసుకు వెళ్ళగలుగుతుంది. తెలంగాణా కన్నా ఇంకా వెనుకబడి ఉన్న రాయలసీమ ప్రాంతం నుండి, ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రాంతం నుండి, గిరిజన ప్రాంతం నుండి కూడా తాము వెనుకబడి

ఉన్నందున మాకు కూడా ప్రాంతీయ అభివృద్ధి కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ రావచ్చు. అన్ని కోణాలలో పరిశీలించినప్పుడు ఇప్పుడు ఉన్న పరిస్థితులలో మూడు ప్రాంతాలలోని ప్రజల సామాజిక సంక్షేమానికి, ఆర్థిక ప్రగతికి ఈ 6 వ ప్రత్యామ్నాయమే అత్యుత్తమమని, జాతీయ కోణాలలో కూడా ఇదే ఉత్తమమని కమిటీ అభిప్రాయపడింది. దేశంలో ఇతర ప్రాంతాలలో - అచ్చటి ప్రాంతీయ ఆకాంక్షలను పరిష్కరించడంలో కూడ ఈ తరహా ప్రత్యామ్నాయం ఉపయోగకరంగా ఉంటుందని కమిటీ భావిస్తోంది.

**రాష్ట్రంలో పాలన స్తంభించింది:**

ఎంతో విలువైన సూచనలను, సమాచారాన్ని శ్రీకృష్ణ కమిటీ రిపోర్టులో పొందుపరచినా, ఆ రిపోర్టును రాజకీయ పార్టీలు అధ్యయనం చేసి ప్రజలలోకి తీసుకొని వెళ్ళలేదు. కేంద్రప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీ రిపోర్ట్‌ను పార్లమెంట్‌కు సమర్పించలేదు. రాజ్యాంగం ప్రకారం నూతన రాష్ట్రాల ఏర్పాటు ఆర్టికల్ 3 ప్రకారం పార్లమెంట్‌కు అధికారం ఉంది. కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొందరు రాష్ట్రానిన విభజించాలనీ, కొందరు సమైక్యంగా ఉంచాలని చేస్తున్న డిమాండ్లలోని ఔచిత్యాన్ని మన రాష్ట్రంనకు చెందిన పార్లమెంట్ సభ్యులే కాక ఇతర రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులకు కూడా అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అంశంలో ముడిపడి ఉన్న సమస్యలపైన పార్లమెంట్‌లో చర్చ జరగవలసిన అవసరం ఉంది.

- కాంగ్రెస్ పార్టీ వైఖరి, అధ్యక్షురాలు సోనియా గాంధీ మనసులో ఏముందో తెలియని అయోమయ పరిస్థితులలో తెలంగాణా ప్రాంతానికి చెందిన మంత్రులతో సహా ప్రజాప్రతినిధులు ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయవలసిందేనని, సీమాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు రాష్ట్ర విభజనకు ఎట్టి పరిస్థితులలో అంగీకరించేది లేదని పదే పదే మాట్లాడటం వలన ప్రజలు అయోమయంలో పడ్డారు. అప్పటి నుండి తెలంగాణా సమస్య విషయంలో ప్రజాప్రతిధులు - తెలంగాణా, సీమాంధ్ర ప్రాంతాల వారిగా చీలిపోయారు. రాష్ట్రంలో రైతులు, వాణిజ్య పారిశ్రామిక వేత్తలు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ఎంతో ప్రాముఖ్యత కల్గిన అంశాల విషయంలో కేంద్రప్రభుత్వంతో చర్చించి

అనుకూలంగా నిర్ణయాలను రాబట్టడం గానీ, రాష్ట్రప్రభుత్వంతో నిర్ణయాలు చేయించడం గానీ జరగలేదు. తెలంగాణా ఉద్యోగులు చేపట్టిన సకల జనుల సమ్మె సందర్భంగా ప్రజాజీవితం విద్యుత్ కొరతతో తీవ్రమైన యిబ్బందులకు గురైంది. వందలాది పరిశ్రమలు విద్యుత్ కొరతతో మూతపడ్డాయి. ఫలితంగా అనేక యూనిట్లు ఖాయిలా పడ్డాయి. వేలాది కార్మికులకు తీవ్రమైన నష్టం చేకూరింది. పరీక్షలకు హాజరు కావలిసిన లక్షలాది మంది విద్యార్థులు వేళా పాళా లేని కరెంటు కోతతో తీవ్రమైన అసౌకర్యానికి గురయ్యారు. పంటలు పోయి రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక కోణంలో చూస్తే ఆ సమయంలో మన రాష్ట్రానికి విద్యుత్ కొరత వలన కొన్ని వేల కోట్ల రూపాయల నష్టం సంభవించింది. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? అనే సంశయం సామాన్య ప్రజలకు కలిగింది.

**తెలుగు జాతికి సిగ్గుచేటు:**

తెలుగు జాతి ఔన్నత్యాన్ని, కీర్తిని దశదిశలా చాటిన ఎందరో మహానుభావులను స్మరించుకొనేందుకు ట్యాంక్‌బండ్ మీద "తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త ప్రాంగణం" పేరుతో యన్.టి.రామారావు గారు నెలకొల్పిన విగ్రహాలు హైదరాబాద్ నగరానికే వన్నె తెచ్చాయి. ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగకర్తలుగా, సాంఘిక దురాచారాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, తెలుగు సాహిత్యానికి తన కాలాన్ని స్వర్ణయుగంగా చేసిన సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు, ఆంధ్ర మహాభారత రచనకు శ్రీకారం చుట్టిన ఆదికవి నన్నయ్య, ప్రజాకవి వేమన, తెల్లవారికి సింహాస్వప్నమైన మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, అణగారిన ప్రజల ఆర్తనాదాలను తన కలం గళం ద్వారా వినిపించిన శ్రీశ్రీ వంటి మహానుభావుల విగ్రహాలను "మిలియన్ మార్చ్" సందర్భంగా ధ్వంసం చేయడం తెలుగు జాతి సిగ్గుతో తలవంచుకోవలసిన విషయం.

**హైదరాబాద్‌తో కూడిన తెలంగాణా సాధ్యం కాదు: కేంద్ర హోంమంత్రి అద్వాని**

బి.జె.పి. 1997 లో కాకినాడలో జరిగిన జాతీయ మహాసభలో చిన్న రాష్ట్రాలకు అనుకూలంగా తీర్మానం చేయడమే గాక "ఒక ఓటు - రెండు రాష్ట్రాలు" అనే నినాదంతో ఎన్నికల్లో పాల్గొంది. 1999 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి బి.జె.పి. కి పొత్తు ఉంది. తెలుగుదేశం తరుపున 29 మంది, బి.జె.పి. తరుపున 5 గురు లోక్‌సభ ఎన్నికలలో గెలిచారు. తెలుగుదేశం పార్టీ వాజ్‌పేయి గారి ప్రభుత్వానికి వెలుపల నుండి మద్దతు ఇచ్చింది. మన రాష్ట్రంనుండి కాంగ్రెస్ పార్టీ వారు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసినదని కోరగా ఆనాడు హోంమంత్రిగా ఉన్న ఎల్.కె.అద్వానీ గారు రాష్ట్ర రాజధాని హైదరాబాదు తెలంగాణా ప్రాంతంలోనే ఉండగా, హైదరాబాదుతో కూడిన తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు సాధ్యం కాదని తిరస్కరించారు.

**రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి వ్యూహం:**

ఇప్పుడు 2014 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశంలో కాంగ్రెస్ తర్వాత ప్రధానపక్షమైన భా.జ.పా - ప్రధాని అభ్యర్థిగా మోడీ ని ప్రకటించడం, మోడీకి ప్రజల్లో ఉన్న ఆదరణ, బి.జె.పి ప్రభుత్వం వస్తే వెంటనే ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటుచేస్తామనే హామీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకురాలు శ్రీమతి సుష్మాస్వరాజ్ ప్రత్యేక తెలంగాణా బిల్లును యు.పి.ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టాలని, ప్రభుత్వం బిల్లు పెడితే తాము సమర్థించగలమని మాట్లాడిన అంశాలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ వ్యూహాన్ని రూపొందింపచేసింది. యు.పి.ఏ-2 ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల 2జి స్కామ్, వేల కోట్ల రూపాయల కామన్‌వెల్త్ క్రీడల కుంభకోణం, రూ. లక్ష కోట్ల పైగా విలువైన బొగ్గు కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అంశాలను రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రతిపక్షాలు ప్రచారాస్త్రాలుగా వినియోగించుకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో దేశ ప్రజల దృష్టిని ఈ అంశాలపై నుండి మరలించి రాజకీయ లబ్ధిపొందడానికి, శ్రీమతి సోనియా గాంధీ 12 సం॥లు ఈ విషయంపై ఏమీ తేల్చకుండా ఊరుకొని కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం ఇప్పుడు అకస్మాత్తుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని

విభజించి, హైదరాబాదుతో కూడిన తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం కడు దుర్మార్గం. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి శాశ్వత ఆహ్వానితుడు ఐ.యన్.టి.యు.సి అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి గారిని ఆహ్వానించలేదు. ఆయన తెలంగాణా ప్రాంతీయుడైనప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమైక్యంగా ఉంటేనే అన్ని ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందుతాయనే భావన కలిగిన వ్యక్తి కాబట్టే ఆయనను సి.డబ్లు.సి. మీటింగ్‌కి ఆహ్వానించలేదు. సోనియా గాంధీ నియంతృత్వ వైఖరికి ఇది నిదర్శనం. రాష్ట్రాన్ని విభజించాలనే నిర్ణయం సోనియా గాంధీ తీసుకున్నదనే సమాచారం గులాం నబీ ఆజాద్‌కు, దిగ్విజయ్ సింగ్‌కు, అహ్మద్ పటేల్‌కు మాత్రం తెలుసు. ఆంధ్ర ప్రాంతం వారిని బుజ్జగించేందుకు కావూరి సాంబశివరావు, చిరంజీవి, జె.డి. శీలం, కోట్ల సూర్య ప్రకాశరెడ్డి, కిల్లి కృపారాణి లకు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించారు. పనబాక లక్ష్మి మరియు పురంధేశ్వరి గార్లకు కొంత ప్రాధాన్యత కలిగిన శాఖలను కల్పించారు. సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయాలనే వ్యూహంలో ఇది ఒక భాగం.

**రోడ్ మ్యాప్‌పై చర్చించనేలేదు:**

రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని, రాష్ట్ర పి.సి.సి. అధ్యక్షుడిని మన రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్దడానికి అవసరమైన పరిష్కార మార్గాన్ని, రోడ్ మ్యాప్‌ను తయారు చేసి తనకు ఇవ్వవలసిందని కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ అధిష్టానం కోరింది. వారు ముగ్గురు వారి వారి దృక్పథాలతో రోడ్ మ్యాప్‌ను ఇచ్చారు. వీటిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, పి.సి.సి. అధ్యక్షుడు రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాల్సిన ఆవశ్యకతను వివరణాత్మంగా అందించారు. ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక తెలంగాణా రోడ్ మ్యాప్‌ను ఇచ్చారు. వీటిలోని సాధ్యాసాధ్యాలపై చర్చ జరగలేదు. రాష్ట్రాన్ని విభజించవలసివస్తే, కొత్త రాష్ట్రానికి రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఆ విషయంలో రాయలసీమ ప్రాంతంవారి అభిప్రాయం ఏమిటి? కోస్తా ఆంధ్ర ప్రాంతంవారి అభిప్రాయం ఏమిటి? కృష్ణా నదీ జలాల పంపకం, నిర్వహణలో ఉత్పన్నమయ్యే సమస్యలు, రాష్ట్ర ఆస్తులు, అప్పులు, ఆదాయ వనరుల పంపిణీ, నూతన రాజధాని ఏర్పాటుకు

అవసరమైన నిధులు, హైదరాబాదుకు ప్రత్యామ్నాయంగా నిర్మించవలసిన రాజధానీ నగరానికి కావలసిన ఆర్థిక సహాయమేకాక మౌలిక సదుపాయాల కల్పన ,ఉద్యోగుల నియామకాలు ,బదిలీలు ,విద్యార్థులకు సీట్లు, ఉపాది అవకాశాలు మొదలైన కీలక అంశాలపై ఏమాత్రం చర్చించకుండా గుంభనంగా ఉంచి అకస్మాత్తుగా జూలై 30వతేదీన యూ.పి.ఏ భాగస్వామ్య పక్షాలతో సమావేశాన్ని నిర్వహించారు. కాశ్మీర్ ముఖ్యమంత్రి ఫరూక్అబ్దుల్లా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నాయకులు కేంద్రమంత్రి యి.అహ్మద్ రాష్ట్రవిభజన మంచి నిర్ణయం కాదని, ఈనిర్ణయం తీసుకోవడం వలన, ఇప్పటికే ఉన్న కొన్ని ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌కు తోడు జమ్ము, లడక్, సౌరాష్ట్ర మున్నగు ప్రాంతాలలో కూడా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లు ముందుకు వస్తాయని, దేశసమైక్యతకు, సమగ్రతకు ఈ పరిణామాలు మంచిది కాదని తమ అభిప్రాయం తెల్పినప్పటికీ వారిని నోరుమూయించి యు.పి.యే పక్షాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించాయని ప్రకటించడం సిగ్గుచేటు.

**సమైక్య రాష్ట్రంతోనే ప్రగతి: శ్రీకృష్ణ కమిటీ**

ఈ అంశాలన్నింటీని జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ కూలంకషంంగా పరిశీలించి, మూడుప్రాంతాల, వివిధ వర్గాల ప్రజానీకం అభిప్రాయాలను తీసుకొని, గతంలో జరిగిన విభజన ఉద్యమాలను, ఆ ఉద్యమాలకు దోహదం చేసిన కారణాలు, వర్తమానంలో రాష్ట్రం లోని వాస్తవ పరిస్థితులు అన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసింది. ఇప్పుడున్న పరిస్థితులను చక్కదిద్ది రాష్ట్రంలో శాంతియుతంగా, సామరస్యంతో, వివిధ ప్రాంతాల అభివృద్ధికి కొన్ని ప్రత్యామ్నాయాలను సూచించింది. ఆ ప్రత్యమ్నాయాల లోని మంచి చెడు, సాధ్యాసాధ్యాలను విశ్లేషించి అంతిమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమైక్యంగానే కొన సాగించడం ఉత్తమమని, తెలంగాణా ప్రాంత అభివృద్ధికి రీజినల్ కమిటీని ఏర్పాటు చేసి, చట్టబద్ధతను, అధికారాలను కల్పిస్తూ ఆ ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించటం ద్వారా ఆ ప్రాంత ప్రజలలో విశ్వాసాన్ని పాదుకల్పవచ్చని సూచించింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో ప్రజలందరూ అభివృద్ధిని సాధించాలంటే రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడమే మేలు అని రికమండ్

చేసారు. శ్రీకృష్ణ కమిషన్ పేర్కొన్న అంశాలపై కేంద్రప్రభుత్వ స్థాయిలో గాని, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోగానీ ఏనాడు చర్చలు జరగలేదు.

**తాంబూలాలిచ్చేశాం - తన్నుకు చావండి:**

నూతనంగా గృహం నిర్మించుకోడానికి అవసరమైన స్థలం, నిర్మాణ సామగ్రి ,అందుకవసరమైన ఆర్ధిక వనరులు సమకూర్చుకోకుండానే తాము వుంటూ వున్న పూరింటిని తగులబెట్టుకొన్న విధంగానే కేంద్ర ప్రభుత్వం విభజన వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యల గురించి చర్చించకుండా విభజన నిర్ణయాన్ని ప్రకటించేసింది. "తాంబూలాలిచ్చేశాం, తన్నుకు చావండి" అన్న చందంగా వ్యవహరించి అయిదు కోట్లమంది సీమాంధ్ర ప్రజల హృదయాలను గాయపరచింది. ఇప్పుడు మీ సమస్యలేమిటో చెప్పండి అని కేంద్రం అడగటం ఎంతవరకు సమంజసం?

2014 ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తగు సంఖ్యలో లోక్‌సభ స్థానాలను పొందడానికి, ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పరచడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ జూలై 30వ తేదీన నిర్ణయం తీసుకోవడం అత్యంత దురదృష్టకరం. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దిగ్విజయ్ సింగ్ సి.డబ్ల్యు.సి. నిర్ణయాన్ని ప్రకటిస్తూ, టి.ఆర్.యస్. పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పరిస్తే తె.రా.స. ను కాంగ్రెస్ పార్టీలో విలీనం కావించే విధంగా తె.రా.స. అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావుతో లోపాయకారీగా అవగాహన కుదుర్చుకుంది. తెలంగాణా ప్రాంతంలోని 15 లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కుతాయనే అంచనాతో ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ సంవత్సరం నవంబర్, డిసెంబర్ మాసాలలో ఆరు రాష్ట్రాలలో జరుగవలసిన శాసన సభ ఎన్నికలతో పాటు, పార్లమెంటుకు కూడా ఎన్నికలను కలిపి నిర్వహించాలనే తలంపుతో హడావిడిగా ఈ నిర్ణయం తీసుకుంది.

**రాష్ట్ర విభజన వలన ఎదురయ్యే సమస్యలు:**

రాష్ట్ర విభజన జరిగితే ఉత్పన్నమయ్యే అనేక అంశాల గురించి ఆయా ప్రాంతాలలోని ప్రజా ప్రతినిధులతో, రాజకీయ పక్షాలతో,

నిపుణులతో ఏ మాత్రం చర్చలు జరుపకుండానే ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకోవడం అత్యంత దురదృష్టకరం, అమానుషం. కనీసం కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడు ప్రాంతాల నాయకులతో, ప్రజా ప్రతినిధులతో కూడా చర్చించక పోవడం, వారెవ్వకిరికి ఒకటి రెండు రోజుల ముందు వరకు విభజన నిర్ణయం గురించి చెప్పకపోవడం సీమాంధ్ర ప్రాంత ప్రజల పట్ల సోనియా గాంధీ నిర్లక్ష్య వైఖరికి తార్కాణం. "జై తెలంగాణా - జై ఆంధ్ర " ఉద్యమాల సమయంలో రాష్ట్ర విభజన (1969 - 1972) జరిగి వుంటే కొంతమేరకు పరిస్థితి మరో విధంగా ఉండి ఉండేది. సీమాంధ్ర ప్రాంతం కూడ గణనీయంగా అభివృద్ధి చెంది ఉండేది. మన రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు కాంగ్రెస్ అయినా తెలుగుదేశం అయినా హైదరాబాద్ నగరం అందరిదీ అనే భావనతో హైదరాబాద్ అభివృద్ధికే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చారు.

**సీమాంధ్ర విద్యావంతులకు ఉపాధి అవకాశాలు ఎలా?**

ఐ.డి.పి.యల్, బి.హెచ్.ఇ.యల్, హెచ్.ఎ.ఎల్, హెచ్.యం.టి. లాంటి కేంద్రప్రభుత్వానికి సంబంధించిన ఎన్నో పరిశ్రమలు, డిఫెన్స్ రంగంలోని అనేక సంస్థలతో సహా హైదరాబాద్ పరిసరాల్లోనే నెలకొల్పబడ్డాయి. హైదరాబాద్ నగరం భౌగోళికంగా దేశ రక్షణ కోణంలో చాలా కీలకమైన స్థానంలో ఉండటం వలన అనేక కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖకు సంబంధించిన సంస్థలు ఇక్కడ వచ్చాయి. రాష్ట్రప్రభుత్వ పరిశ్రమలు అక్కడే నెలకొల్పబడ్డాయి. అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైలు, అవుటర్ రింగు రోడ్డుతో సహా యితర మౌలిక వసతులు హైదరాబాద్ నగరంలో ఉండటం వల్ల రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు కూడ అక్కడే పరిశ్రమలు అధికంగా స్థాపించారు. రెడ్డి ల్యాబ్స్, నాట్కో ఫార్మా, అరబిందో ఫార్మా మున్నగు వందలాది ఫార్మా సూటికల్ పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో హైటెక్ సిటీ నిర్మాణం, టి.సి.యస్, విప్రో, సత్యం, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, ఇంటర్ గ్రాఫ్, కాగ్నిజంట్, ఐ.బి.యమ్, ఒరాకిల్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థలతో పాటు వందలాది ఐ.టి.ఇ.యస్ సంస్థలు అక్కడే నెలకొల్పబడ్డాయి. ఐ.టి., ఐ.టి.ఇ.యస్ రంగాలకు చేయూత వలన

లక్షలాది మంది యువతీ యువకులకు అక్కడే ఉపాధి అవకాశాలు లభించాయి. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, సి.సి.యం.బి, ఇక్రిశాట్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు వచ్చాయి.

సీమాంధ్రలోని ప్రతీ గ్రామం నుండి, పట్టణం నుండి ఏదో ఒక ఉద్యోగం కోసమో, చిన్న చిన్న వ్యాపారాల నిమిత్తమో లక్షలాది కుటుంబాలు హైదరాబాద్ వెళ్ళి స్థిరపడి జీవనం కొనసాగిస్తున్నారు. తమ స్వగ్రామంతో పాటు హైదరాబాద్ నగరంతో కూడ గాఢమైన అనుబంధాన్ని ఏర్పరచుకొన్నారు. ఈనాడు పేద వారితో సహా అందరూ అప్పో సప్పో చేసి, తమ బిడ్డల ఉన్నత భవిష్యత్తు కొరకు తమ సుఖాలను త్యాగం చేస్తూ చదివిస్తున్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ ఐ.టి, యం.సి.ఎ, ఫార్మా మున్నగు కోర్సులలో విద్యావంతులకు నూటికి, తొంభై మందికి హైదరాబాద్ లోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. హైదరాబాద్ విడిపోతే వీరి పరిస్థితి ఏమిటి?

పైన పేర్కొన్న విధంగా వేలాది పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు , ఐ.టి. సంస్థలు హైదరాబాద్ లోనే ఉండటం వలన విభజన జరిగితే భవిష్యత్తులో సీమాంధ్ర ప్రాంతంలో ఉన్నత విద్యలో ఉత్తీర్ణులైన వారికి అక్కడ ఉపాధి అవకాశాలు లభించడం దుర్లభమవుతుంది. సీమాంధ్ర ప్రాంతంలో హెచ్చు స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడానికి కనీసం పాతికేళ్ళు పడుతుంది. అప్పటి వరకు లక్షలాదిమంది విద్యావంతులు నిరుద్యోగులుగా ఉంటే సమాజంలో అసంతృప్తి, అశాంతి పెరుగుతాయి. జీవితంలో అత్యంత విలువైన కాలంలో విజ్ఞానాన్ని సంపాదించి, లక్షలాది మంది నిరుద్యోగులుగా ఉండిపోతే వారి కుటుంబాలకే కాక, దేశాభివృద్ధికి కూడా నష్టం చేకూరుతుంది.

**దేశ సమగ్రతకు భంగం:**

గతంలో 1972లో శ్రీమతి ఇందిరాగాంధీ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాన్ని ప్రక్కన పెట్టి తీసుకొన్న ఈ నిర్ణయం మన రాష్ట్రంలోనే కాక దేశ వ్యాప్తంగా తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. విదర్భ, పుర్వాంచల్, అవధ్, హరితప్రదేశ్, బుందేల్‌ఖండ్, గూర్ఖాలాండ్, బోడోల్యాండ్, కిర్బీఆంగ్‌లాంగ్ , మిధిలాంచల్ మొ॥ ఎన్నో సమస్యలు ఉత్పన్నమౌతాయి. ఇప్పటికే తీవ్రవాద

సమస్యతో సతమతమౌతున్న కేంద్ర ప్రభుత్వం పలురాష్ట్రాలలో ఉవ్వెత్తున, ప్రారంభమైన విభజన సమస్యలతో దేశంలో శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం ఏర్పడుతుంది. అందులోనూ కొన్ని ప్రాంతాలు దేశ సరిహద్దులలో ఉన్నాయి. మన దేశ సమగ్రతకు భంగం కలిగించడమే లక్ష్యంగా కల కొన్ని విదేశీ తీవ్రవాద సంస్థలకు ఊతం లభిస్తుంది. శ్రీకృష్ణ కమిటీ ఈ విషయం గురించి తన రిపోర్టులో హెచ్చరించి ఉన్నప్పటికి కూడా కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం అత్యంత దురదృష్టకరం.

**కృష్ణా, గోదావరి జలాల లభ్యతకు విఘాతం:**

దాదాపు 160 సం॥ల క్రితమే సర్. ఆర్థర్ కాటన్, కెప్టెన్ ఓ.ఆర్.ఆర్. ల కృషి ఫలితంగా ఏర్పడిన గోదావరి, కృష్ణా డెల్టాలకు రాష్ట్ర విభజన జరిగితే భవిష్యత్తులో సాగు నీరు సరిపడా, సకాలంలో లభించడం దుర్లభమవుతుంది. పోలవరం ప్రాజెక్టు కట్టి గోదావరి వరద జలాల నుండి 80 టి.యమ్.సి ల నీటిని తెచ్చుకుంటే తప్ప కృష్ణా డెల్టాలో సజావుగా వరి పంట పండించే పరిస్థితి ఉండదు. ఎగువ పరివాహక ప్రాంతాలలో అటవీ విస్తీర్ణం తగ్గడం, వాతావరణంలో మార్పుల వలన గోదావరి డెల్టాలో కూడా గతంలో వలె ప్రస్తుతం సార్వా, దాళ్వా పంటల సాగు సాధ్యపడదు. తెలంగాణా ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూర్చే దేవాదుల, కాంతనపల్లి, దుమ్మగూడెం, ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టులు గోదావరి నది ఎగువ భాగంలో ఉన్నాయి. ఆ ప్రాజెక్టుల వలన దిగువన ఉన్న గోదావరి డెల్టాకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. కానీ, ఆంధ్రప్రాంతం వారు ఎవరూ అందుకు అభ్యతరం చెప్పలేదు. వాస్తవానికి పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరే ఎక్కువ నీరు శబరి నది నుండి వస్తాయి. అయినా పోలవరం ప్రాజెక్టును కట్టటానికి వీల్లేదని తె.రా.స పార్టీ వారు సుప్రీం కోర్టులో దావా వేసివున్నారు. ఒరిస్సా ప్రభుత్వం చేత కూడా వీరు అభ్యంతరం పెట్టించారు. ఇటీవల కేంద్రం ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించిన తరువాత కూడా కె.సి.ఆర్ తెలంగాణా లో కొంత ప్రాంతం ముంపుకు గురవుతుంది కావున ఎట్టి పరిస్థితులలోనూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని ప్రకటించడాన్ని రైతులంతా గమనిస్తూనే ఉన్నారు.

మొదట్లో శ్రీశైలం ప్రాజెక్టు హైడల్ ప్రాజెక్టుగా నిర్మించబడింది. యన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా వుండగా తరచుగా కరువు కాటకాల భారిన పడుతూ వుండే రాయలసీమ ప్రజానీకానికి త్రాగునీరు, సాగునీరు అందించాలనే లక్ష్యంతో తెలుగుగంగ ప్రాజెక్టు చేపట్టారు. అనంతరం యస్.ఆర్.బి.సి. తో పాటు మరికొన్ని పథకాలు కూడా చేపట్టబడినాయి. ఎగువన వున్న కర్నాటక మహారాష్ట్రాలలో అనేక ప్రాజెక్టులు నిర్మాణమవుతున్నందున యన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉండగా శ్రీశైలం డ్యామ్ నుండి జలవిద్యుత్ ఉత్పత్తి మరియు కృష్ణాడెల్టా, నాగార్జున సాగర్ కుడి, ఎడమ అయకట్టులకు సాగునీటి సరఫరాలకు సంబంధించి మార్గదర్శక సూత్రాలతో జి.వో.నెం.69 జారీ చేశారు. శ్రీశైలం డ్యామ్ వద్ద కనీస నీటి మట్టాన్ని 834 అడుగులుగా నిర్ణయించారు. రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రి కాగానే శ్రీశైలం డ్యామ్ వద్ద కనీస నీటి మట్టాన్ని (ఎమ్.డి.డి.యల్) 834 అడుగుల నుండి 854 అడుగులకు పెంచడం, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి 11,000 క్యూసెక్కులకు అదనంగా కొత్తగా 44,000 క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా ఏర్పాట్లు చేసినందున ఇప్పుడు బచావత్ ట్రిబ్యూనల్ కృష్ణా నది నుండి కృష్ణా డెల్టాకు, నాగార్జున సాగర్ ఆయుకట్టుకు సాకాలంలో నీరు అందటం అనుమానంలో పడింది. గత సంవత్సరం శ్రీశైలం డ్యామ్ నుండి దిగువకు నీరు వదలరాదని టి.ఆర్.యస్ కు ముఖ్య సలహాదారుడు విద్యాసాగరరావు హైకోర్టులో దావా వేసి ఆపు చేయించారు. కేవలం వరుణ దేవుడి దయ వలన సార్వా పంట రైతుల చేతికి వచ్చింది. ఈ సంవత్సరం బంటుమిల్లి, పెడన దివిసీమలో చివరి ప్రాంతాలలో వెదజల్లు పద్ధతిలో వేసిన వరి పైరు వేలాది ఎకరాలు మాడిపోయింది. నారుమళ్ళు పనికిరాకుండి పోయాయి. ఇప్పుడు సమైక్య రాష్ట్రంగా ఉంటేనే కొన్ని కారణాల వల్ల డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ నీరు వదలటం ఆలస్యమవుతుంది. అటువంటిది రాష్ట్ర విభజన జరిగినా లేక రాయల తెలంగాణా ఏర్పడినా మనం వారిని అడగటానికి కూడా అవకాశం ఉండదు.

గోదావరి నుండి 80 టి.యం.సి.ల నీటిని పోలవరం కాలువ ద్వారా కృష్ణా బ్యారేజినకు ఎగువన కలుపవలెను అను పథకం పురిట్లోనుండగానే, దుమ్ముగూడెం నుండి నాగార్జునసాగర్ టేల్ పాండ్ వద్దకు కాలువను త్రవ్వకుండానే శ్రీశైలం డ్యామ్ వద్ద యం.డి.డి.ఎల్. 854 అ॥ పెంచటము మరియు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వెడల్పు పెంచటమువలన కృష్ణాడెల్టాకు, నాగార్జున సాగర్‌కు రాకముందే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి కృష్ణానీరు ప్రవహించెస్థితి ఏర్పడింది. ఫలితంగా కృష్ణా డెల్టాలో వరినాట్లు చాలా ఆలస్యము అగు పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర, కర్నాటకలో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తే తప్ప కృష్ణాడెల్టాకు సెప్టెంబరు నెలాఖరునకు కూడా సాగునీరు రాని పరిస్థితి ఎదురయ్యే ప్రమాదము ఉన్నది. అనగా మొదటి వరిపంట తుఫాన్‌ల భారిన పడుట, రెండవ పంట అపరాలు పంటను పూర్తిగా కోల్పోవలసి వచ్చును.

ఇంతే కాక శ్రీశైలం డ్యాంకు ఎగువన గాలేరు - నగిరి, హంద్రీ-నీవా, వెలిగొండ, నెట్టింబోడు, కల్వకుర్తి, యన్.ఎల్.బిసి మున్నగు పథకాలు చేపట్టబడినాయి. వీటికి 227 టి.ఎం.సిల నీరు అవసరమౌతుంది. వై.యస్. ముఖ్యమంత్రిగా నుండగా 2006 మార్చినందు బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు పైన పేర్కొన్న ఈ పథకములకు కృష్ణా మిగులు జలాలనుండి నీటి హక్కును కేటాయింపును కోరబోమని లికితపూర్వకంగా తెలియ పర్చినారు. అందువలన, బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఈ పథకములకు ఒక్క టి.యం.సి నీటిని కూడ కేటాయించలేదు. ఈ పథకములు నీటి కేటాయింపులు లేకపోయినను పనులు ముందుకు సాగుతూనే వున్నాయి. విభజన జరిగితే ఈ పథకములకు నికర జలాలునుండి నీటిని కేటాయించి తీరాలనే వాదన ముందుకు రావటం తథ్యం. ఈ సమస్య తేలికగా పరిష్కారం అయ్యేది కాదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిట్టచివరన ఉన్నది కావున కొన్ని సంవత్సరములలో కరువు పరిస్థితులు ఏర్పడినపుడు పై రాష్ట్రములనుండి కృష్ణానీరు క్రిందికి రానప్పుడు కృష్ణా డెల్టా మరియు నాగార్జున సాగర్ కుడి,

ఎడమ కాలువల ఆయకట్టు అవసరాలను దృష్టిలో నుంచుకొని శ్రీశైలం డ్యామ్‌లో 60 టి.యం.సి.ల నీటిని నాగార్జునసాగర్ డ్యామ్‌లో 90 టి.యం.సి.ల నీటిని క్యారీ ఓవర్‌గా నుంచుకొని వాడుకొను వెసులుబాటును బచావత్ ట్రిబ్యునల్ కల్పించినది. బ్రజేష్ కుమార్, ట్రిబ్యునల్ కూడా ఈ విధమైన తీర్పునే ఇచ్చినది. అయితే, రాష్ట్ర విభజన జరిగితే రాష్ట్రం మూడు లేక నాలుగు రాష్ట్రములుగా విడిపోవటం అనివార్యమౌతుంది. అట్టి పరిస్థితులలో కృష్ణాడెల్టా ఎడారిగా మారే ప్రమాదమున్నది. నీరుడు కృష్ణా డెల్టాకు అతి తక్కువ నీరు రాగా, సాగర్ కాలువలకు త్రాగునీరు మాత్రమే విడుదలైంది అనే వాస్తవం మరువరానిది.

నూతనంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన భూసేకరణ పునరావాస చట్టం 2013 ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణమునకు పలు అవరోధాలు ఎదురయ్యే అవకాశం వున్నది. కేంద్రం జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చినామని ప్రకటించిన ఆచరణలలో ముందుకు సాగదు ఫలితంగా గోదావరి డెల్టా రైతులు కూడా తీవ్రమైన నష్టాల భారినపడే ప్రమాదం స్పష్టంగా కన్పించుచున్నది.

**ఆదాయము - అప్పులు పంపకాలు :**

ప్రస్తుతం మన రాష్ట్రానికి రూ. 1,80,000 కోట్లు అప్పు ఉన్నది. జనాభా ప్రాతిపదికన కోసాంధ్రాకు దాదాపు 60 నుండి 70 వేల కోట్ల రూపాయల అప్పు భారం పడుతున్నది. రానున్న కొన్ని దశాబ్దాములపాటు కోస్తాంధ్ర ప్రాంతములో అభివృద్ధికి ఆస్కారం ఉండదు.

రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరము, రంగారెడ్డి జిల్లాలనుండి 40% ఆదాయం రాష్ట్ర ఖజానాకు జమఅగుచున్నది. ఇట్టి పరిస్థితులలో రాష్ట్రం విడిపోతే సీమాంధ్ర ప్రాంతము తీవ్రంగా నష్టపోనున్నది. ఇప్పటికే రాష్ట్రంలో చాలా వెనుక బడియున్న రాయలసీమ, ఉత్తరకోస్తా ప్రాంతములు, అభివృద్ధి పధములో ముందుకుసాగే అవకాశాలు ఉండవు తెలంగాణాలో ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు కూడా తగినంత అభివృద్ధిని సాధించలేకపోవచ్చు.

హైదరాబాద్‌కు ధీటుగా నూతన రాజధాని ఏర్పాటు 6 దశాబ్దాలకు కూడా సాధ్యపడదు అన్న వాస్తవాన్ని మరువరాదు.

## రాజధాని ఎక్కడ?

హైదరాబాద్ నగరంతో సహా తెలంగాణా రాష్ట్రం ఏర్పడుతుందని దిగ్విజయ్ సింగ్ స్పష్టంగా చెప్పారు. ఒక రాష్ట్రంలో వేరొక రాష్ట్ర రాజధాని కొనసాగటం రాజ్యాంగ రీత్యా బహుశా సాధ్యపడదు. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం అయితేనే తెలంగాణా, సీమాంధ్ర ప్రాంత రాజధానులు అక్కడ ఉండటానికి వీలుంటుంది. ఇది తెలిసి కూడా ఇటు ఆంధ్రా అటు తెలంగాణా ప్రాంతం వారిని కేంద్రం మభ్యపెడుతుంది. రాయలసీమ వారు ఆ ప్రాంతంలోనే రాజధాని ఉండాలంటున్నారు. ఇప్పటికి జరిగిన అనుభవంతో కోస్తా ప్రాంతం వారు అందుకు అంగీకరించకపోవచ్చు. అప్పుడు కోస్తా ఆంధ్రా మరియు రాయలసీమ రెండు రాష్ట్రాలయ్యే పరిస్థితి ఉంటుంది. నూతనంగా సర్వ హంగులతో హైదరాబాద్ కు ధీటుగా రాజధాని నగరాన్ని ఏర్పాటు చేస్తామని దిగ్విజయ్ సింగ్ చెప్పటం సీమాంధ్ర ప్రాంతంలో చెలరేగిన ఆగ్రహాన్ని చల్లార్చటానికి చెప్పే మాటలు తప్ప కార్య రూపం ధరించవు. కొద్ది సం॥ల క్రితం నూతనంగా ఏర్పాటు చేయబడిన మూడు రాష్ట్రాల రాజధానుల నిర్మాణానికి రూ॥1500 కోట్లు ఇస్తామని చెప్పి కేవలం రూ॥ 500 కోట్లు ఇచ్చిన వాస్తవం మన ముందు ఉంది. కేవలం అసెంబ్లీ భవనం, సెక్రటేరియట్, హైకోర్టు భవనాలే కాక, నాణ్యమైన ఉన్నత విద్యను, వైజ్ఞానిక, సాంకేతిక, శాస్త్ర ప్రగతిని అందించేందుకు, సామాన్య ప్రజానీకానికి అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పలు సంస్థలను కూడా ఏర్పాటు చేయవలసి ఉంది. హైదారాబాద్ నగరంలో విశాలాంధ్ర ఏర్పడకముందు నైజాం నవాబు కాలంలోనే ఏర్పడివున్న సంస్థలకు తోడుగా ప్రస్తుత పరిస్థితిని చేరడానికి లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు సమకూర్చడమే కాక దాదాపు 57 సంవత్సరాల వ్యవధి కూడా పట్టింది అనే అంశాన్ని మర్చిపోరాదు. ఇప్పుడు దాదాపు ఏమి లేని పరిస్థితి నుండి హైదరాబాద్ స్థాయికి నూతన రాజధానిని అభివృద్ధి చేసుకోవడానికి ఎంత సమయం పడుతుందో? ఎంత పెట్టుబడి అవసరమవుతుందో? ఎవరు సమకూరుస్తారో? అన్ని సమాధానం లేని ప్రశ్నలే.

**హైదరాబాద్‌లో సీమాంధ్రులకు భద్రత ఎంతవరకు?**

తెలంగాణా రాష్ట్రం ఏర్పడకముందే ఆంధ్రా ఉద్యోగులను మూట ముల్లే సర్దుకుని హైదరాబాద్ నుండి వెళ్ళిపోవాలని కె.సి.ఆర్. అంటున్నారు. ఇదివరకే 'తెలంగాణా వాలే జాగో - ఆంధ్రావాలే భాగో' అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌ను సమైక్యంగా కొనసాగించాలనే కోర్కెను నినదించటానికి హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించుకోవటానికి అవకాశం లభించడం లేదు. సీమాంధ్ర ప్రాంతంలో తమకున్న కొద్దో గొప్పో ఆస్తులను అమ్ముకొని, బిడ్డల చదువుల కొరకు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం ద్వారా హైదరాబాద్‌లో జీవనం కొనసాగిస్తున్న లక్షలాది కుటుంబాల పరిస్థితి డోలాయమానంలో పడుతూవుంది.

**తెలంగాణా వెనుకబడి లేదు**

సీమాంధ్ర పాలకులు తెలంగాణా అభివృద్ధిని నిర్లక్ష్యం చేసారని, అందువలన ఎంతో వెనుకబడి ఉందని, ఆంధ్ర ప్రాంతం వారు దోపిడీ దారులని, నీటి వనరులను కాజేస్తున్నారని తెలంగాణా నాయకులు పదే పదే ప్రకటిస్తూ అమాయకులైన ప్రజలను మోసగిస్తూ వచ్చారు. జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు హైదరాబాద్ మినహా మిగతా తెలంగాణా ప్రాంతం సీమాంధ్రతో పోలిస్తే చాలా వెనుకబడి ఉందని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన దరిమిలా విద్య, వైద్యం, వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమలు మౌలిక వసతులు, సామాజిక - ఆర్థిక ప్రగతి, ఉపాధికల్పనా రంగంతో సహా అన్నిటిలోనూ తెలంగాణా ప్రాంతం గణనీయంగా కోస్తాతో ధీటుగా అభివృద్ధి చెందిందని, తెలంగాణాతో పోలిస్తే రాయలసీమే వెనుకబడి ఉందని స్పష్టంగా పేర్కొంది. కొన్ని కీలక రంగాలలో ప్రగతికి సంబంధించి శ్రీకృష్ణ కమిటీ తెలియపరచిన వాస్తవాలు ఇలా ఉన్నాయి.

**విద్యా రంగం:**

**అక్షరాస్యతలో వృద్ధి :** 1951 లో కోస్తా ఆంధ్రలో 14 శాతం, రాయలసీమలో 12 శాతం, నైజాం తెలంగాణాలో 9 శాతం, హైదరాబాద్ రంగారెడ్డి మినహాయించితే మిగతా తెలంగాణాలో 5 శాతంగా అక్షరాస్యత ఉంది. 2011 నాటికి కోస్తా ఆంధ్రలో 68 శాతం, రాయలసీమలో 65.5 శాతం, నైజాం

తెలంగాణాలో 66.4 శాతం, హైదరాబాద్ రంగారెడ్డి మినహాయించితే మిగతా తెలంగాణాలో 61 శాతానికి చేరింది.

**పాఠశాల విద్య :** పాఠశాల విద్య విషయంలో తెలంగాణా ప్రాంతం కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలతో పోలిస్తే ఎన్నో రెట్లు అభివృద్ధిని సాధించదనేది వాస్తవం.

**SCHOOL EDUCATION[1] (Table 1)**

| Region | No. of School Students | | Students/100 People[2] | | % Student Growth |
|---|---|---|---|---|---|
| | 1956 | 2006-07 | 1956 | 2006-07 | |
| **Coastal Andhra** | 1,730,449 | 4,748,695 | 12 | 15 | 25% |
| **Rayalaseema** | 594,842 | 2,488,161 | 10 | 18 | 88% |
| **Nizam Telangana** | 657,131 | 6,614,374 | 6 | 21 | 249% |
| **Nizam Telangana (excl. Hyd. & Rangareddi)** | 474,659 | 4,728,200 | 5 | 20 | 277% |

1: School Education: Primary Schools, Middle Schools, High Schools and Other Specialty Schools as categorized in the Statistical Abstract of Andhra Pradesh

2: Used 1951, 2001 census population numbers

3: http://aponline.gov.in (Director of School Education, RTI Act publication)

**కళాశాల విద్య :** 1956 లో కోస్తా ఆంధ్రతో పోల్చుకుంటే ఎంతో వెనుకబడి వున్నదల్లా 2001 నాటికి తెలంగాణా కళాశాల విద్యలో ఎంతో ముందుకు దూసుకెళ్ళింది.

**DEGREE EDUCATION[1] (Table 2)**

| Region | No. of Degree Students | | Degree Students/10,000 People[2] | | % Student Growth per 10,000 People |
|---|---|---|---|---|---|
| | 1956 | 2001 | 1956 | 2001 | |
| **Coastal Andhra** | 27,742 | 184,587 | 19 | 58 | 204% |
| **Rayalaseema** | 4,450 | 92,923 | 7 | 69 | 842% |
| **Nizam Telangana** | 10,294 | 197,818 | 10 | 64 | 573% |

1: Degree Education: Arts & Sciences Only. Professional Education numbers were not readily available. Sourced from Statistical Abstract of Andhra Pradesh 1957, 2002.

2: Population for 1956 not available. Used 1951 census population numbers

ప్రాంతాల వారిగా ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల సంఖ్య, విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. తెలంగాణా కంటే ఆంధ్ర రాయలసీమలే వెనుకబడి ఉన్నాయని ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

**Table 3.3: Region-wise data for Govt. and Aided Degree Colleges (2008-09)**

| Regions | Number | | | Enrolment | | | Lecturers | | | Stu Lec Ratio | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | Govt | Aided | Total | Govt | Aided | Total | Govt | Aided | Total | Govt | Aided | Total |
| Telangana inc Hyd | 106 | 53 | 159 | 88956 | 52405 | 141361 | 1881 | 1799 | 3680 | 47.00 | 29.00 | 38.00 |
| Telangana exc Hyd | 99 | 17 | 116 | 80839 | 17232 | 98071 | 1675 | 539 | 2214 | 48.00 | 32.00 | 44.00 |
| Rayalaseema | 54 | 25 | 79 | 46368 | 29819 | 76187 | 1093 | 1025 | 2118 | 42.00 | 29.00 | 36.00 |
| Coastal Andhra | 80 | 101 | 181 | 48758 | 116455 | 165213 | 1501 | 4307 | 5808 | 32.00 | 27.00 | 28.00 |

Source: Higher Education Department, Govt. of Andhra Pradesh

వృత్తి విద్యా కళాశాలలు : ప్రాంతాల వారిగా 2009 - 10 నాటికి మన రాష్ట్రంలో స్థాపించబడివున్న వృత్తి విద్యా కళాశాలల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఒక్క న్యాయ కళాశాలల విషయంలో తప్ప ఇంజనీరింగ్, ఫార్మసీ, బి.ఇ.డి, యం.బి.ఏ. యం.సి.ఏ. కోర్సులన్నిటిలోనూ కోస్తా ఆంధ్ర కన్నా తెలంగాణాయే ముందుంది.

**Table 3.4: Region-wise data on Professional Colleges (2009-2010)**

| | Engineering | | Pharmacy | | B.Ed | | MBA | | MCA | | Law | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Regions | No | Seats | No | Seats | No | Seats | No | Seats | No | Seats | No | Seats |
| Telangana inc Hyd | 286 | 69407 | 159 | 6766 | 248 | 26292 | 404 | 19835 | 253 | 12768 | 17 | 2649 |
| Telangana exc Hyd and Rangareddy | 134 | 31483 | 92 | 3929 | 178 | 18589 | 180 | 8870 | 47 | 4336 | 5 | 702 |
| Rayalaseema | 87 | 20285 | 27 | 1198 | 115 | 12238 | 122 | 5976 | 75 | 3743 | 13 | 2242 |
| Coastal Andhra | 233 | 55913 | 93 | 3945 | 241 | 26134 | 256 | 11632 | 226 | 10495 | 21 | 2851 |

Source: Department of Higher Education, and Commissioner of Technical Education, Govt. of Andhra Pradesh

**వైద్య సేవలు :** విశాలాంధ్ర ఏర్పడిన దరిమిలా హైదరాబాద్ మినహా తెలంగాణాలో వైద్య సేవలు బాగా మెరుగయ్యాయనేది నగ్న సత్యం.

**ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు - పడకలు**

| | 1960-61 వైద్యుల సంఖ్య | 2006-07 వైద్యుల సంఖ్య | 1960-61 పడకల సంఖ్య | 2006-07 పడకల సంఖ్య |
|---|---|---|---|---|
| కోస్తా ఆంధ్ర | 702 | 3111 | 9761 | 13063 |
| రాయలసీమ | 320 | 1601 | 3255 | 5836 |
| తెలంగాణా (హైదరాబాద్ మినహా) | 316 | 1929 | 1976 | 9945 |
| హైదరాబాద్ | 488 | 1351 | 4355 | 6491 |

సోర్స్ : స్టాటిస్టిక్ ఎబ్రాట్ - 2009

**విద్యుచ్ఛక్తి :**

**విద్యుత్ రంగంలో ప్రగతి :** ఒక ప్రాంతంలో వినియోగించబడుతున్న విద్యుచ్ఛక్తి పరిమాణం, తలసరి విద్యుత్ వినియోగం ఆ ప్రాంతంలో అభివృద్ధికి గీటురాయిగా పరిగణింపబడుతుంది. రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు అమలు చేయబడ్డాయి. వేలాది కోట్ల రూపాయలు విద్యుదుత్పత్తి, రవాణా, సరఫరా రంగాలలో ప్రగతిని సాధించడానికి వెచ్చించబడ్డాయి. ఈ క్రింది పట్టికను పరిశీలించినప్పుడు, సబ్ స్టేషన్లు నెలకొల్పటంలో, లైన్లను విస్తరించడంలో తెలంగాణా పట్ల నిర్లక్ష్యం చేయలేదనేది స్పష్టమవుతుంది.

**Table 4.15: Transmission Lines and Distribution Transformers (DTRs) existing as on 31.03.2010**

| REGION | Lines (Kms) | | | | | | DTRs |
|---|---|---|---|---|---|---|---|
| | 400KV | 220KV | 132KV | 33KV | 11KV | LT | Nos. |
| Telangana | 992 | 2378 | 4317 | 8420 | 55489 | 127322 | 316522 |
| Rayalaseema | 124 | 2604 | 3113 | 8815 | 65411 | 97952 | 208757 |
| coastal Andhra | 1247 | 4589 | 4487 | 12501 | 83051 | 154842 | 211489 |

| Region | Number of Substations (KV) | | | | Shunt capacitors (MVAR) |
|---|---|---|---|---|---|
| | 400 KV | 220 KV | 132 KV | 33 KV | |
| Telangana | 4 | 42 | 136 | 1784 | 300 |
| Rayalaseema | 2 | 21 | 53 | 772 | 90 |
| coastal Andhra | 3 | 33 | 88 | 1158 | 0 |

Source : APtransco / APgenco

**వ్యవసాయ గొట్టపు బావులు - అమోఘ ప్రగతి:** శ్రీ. ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా – వ్యవసాయ, విద్యుత్ సరఫరాకు ఒక హార్స్‌పవర్‌కు రూ.50లు ఫ్లాట్ రేటు చొప్పున అందించిన సువర్ణావకాశాన్ని వ్యవసాయదారులందరూ బ్రహ్మాండంగా ఉపయోగించుకొన్నారు. కొన్ని చారిత్రక కారణముల వల్ల కాలువ నీటి సదుపాయం తక్కువగా ఉన్న తెలంగాణా ప్రాంత రైతాంగం ఈ అవకాశాన్ని చాలా బాగా వినియోగించుకున్న ఫలితంగా, 2009–10 నాటికి 15 లక్షల 67 వేల బోరు బావులతో 31 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేసుకుంటూ 10100 వ్యవసాయ విద్యుత్ యూనిట్లను వినియోగించుకుంటున్నారు. సీమాంధ్ర ప్రాంతంలో 11 లక్షల 14 వేల బోరు బావులతో 22 లక్షల ఎకరాలు సాగుచేసుకొంటూ 8000 వ్యవసాయ విద్యుత్ యూనిట్లను వినియోగించుకుంటున్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో చూసినా, తలసరి విద్యుత్ వినియోగంలో చూసినా తెలంగాణా ప్రాంతం సీమాంధ్ర కన్నా చాలా ముందు ఉంది.

**Table 4.16: Category-wise sales of electricity in 2009-10 (MUs)**

| Region | Domestic | Commercial | Industrial | Agriculture | Others | Total |
|---|---|---|---|---|---|---|
| Telangana | 6007 | 1797 | 10674 | 10144 | 2324 | 30949 |
| | | | | | | |
| Rayalseema | 1557 | 382 | 3030 | 4349 | 359 | 9679 |
| coastal Andhra | 5445 | 1175 | 7442 | 3788 | 578 | 18430 |

**సాగునీటి వసతి కల భూమి విస్తరణ :** దాదాపు 160 సం॥ల క్రితమే సర్ ఆర్థర్ కాటన్ గారి పుణ్యమా అని సీమాంధ్రలో చేపట్టబడిన ఇరిగేషన్ ప్రాజెక్టుల వలన దాదాపు 30 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం, మన రాష్ట్రంలో బచావత్ ట్రిబ్యునల్ నాటికే నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభమయ్యి ఉంది. ఆ నాటికి నిర్మాణంలో ఉన్న మైనర్, మీడియం, మేజర్ పథకాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అంతర్జాతీయ న్యాయసూత్రాలను అనుసరించి బచావత్ ట్రిబ్యునల్, కృష్ణా నీటిని, గోదావరి నీటిని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. అనంతరం

అనుమతి ఉన్నా లేకపోయినా పలు కారణాల వలన అనేక ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. 2008-09 నాటికి మన రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు కాలువలు, చెరువులు, బోరు బావులు మున్నగు వనరుల ద్వారా నీటి వసతి కల్గిన భూ విస్తీర్ణం ఈ క్రింది విధంగా ఉంది.

NET AREA IRRIGATED BY SOURCES, DISTRICT WISE, 2008-09
(IN Acres)

| Region | Canals | | Tanks | | Tube Wells | | Other wells | | Other Sources | | Total | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 1958-59 | 2008-09 | 1958-59 | 2008-09 | 1958-59 | 2008-09 | 1958-59 | 2008-09 | 1958-59 | 2008-09 | 1958-59 | 2008-09 |
| Coastal Andhra | 2647505 | 3103548 | 1285655 | 800178 | | 1266719 | 195045 | 161321 | 105413 | 264170 | 4183618 | 5695944 |
| RayalaSeema | 221053 | 345636 | 444536 | 112407 | | 168003 | 264102 | 168002 | 68908 | 30643 | 998897 | 1663503 |
| Telangana | 279708 | 676010 | 1168883 | 588240 | | 1804910 | 199725 | 1343059 | 85425 | 100120 | 1753681 | 4651382 |
| Hyderabad | 10590 | 0 | 45081 | 0 | | 0 | 48804 | 0 | 4808 | 0 | 109373 | 0 |

(Source: Statistical Abstracts of A.P. 1958-59 & 2009.)


ఆంధ్ర ప్రాంతం వారు తమకు రావలిసిన నీటిని దొంగిలించుకుపోతున్నారని ప్రత్యేక తెలంగాణా వాదులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యం. కృష్ణా, గోదావరి నదులకు - తెలంగాణా ఎగువ ప్రాంతంలో ఉండగా, కోస్తా ఆంధ్ర చివరన సముద్రపు సమీపంలో ఉంది. పై వారు వాడుకోగా వస్తూ ఉన్న నీటిని, కోస్తా ఆంధ్రలో వినియోగించుకోలేకపోతే ఆ నీరు సముద్రంలోకి వృధాగా పోతుంది. కావున వారు చేస్తున్న వాదనలో పసలేదు. శీలం సిద్దారెడ్డి, మండవ వెంకటేశ్వరావు, కడియం శ్రీహరి, పొన్నాల లక్ష్మయ్య మున్నగు తెలంగాణా ప్రాంత మంత్రులే చాలా కాలం ఇరిగేషన్ శాఖను నిర్వహించిన సంగతి మర్చిపోరాదు.

**వ్యవసాయ ప్రగతి :**

పంటల దిగుబడులు వ్యవసాయ ప్రగతికి సూచికగా భావించవలసి ఉంటుంది. 1962-65 లో చూస్తే సగటున హెక్టారు పంట విస్తీర్ణంలో పంట విలువ తెలంగాణాలో రూ.3320, రాయలసీమలో రూ.4795, కోస్తా ఆంధ్రలో రూ.7422 గా ఉంది. 2003-06 కాలంలో సగటున హెక్టారు పంట విస్తీర్ణంలో పంట విలువ తెలంగాణాలో రూ.14200, రాయలసీమలో రూ.8500, కోస్తా ఆంధ్రలో రూ.18200 గా ఉంది. 1962-65 తో పోలిస్తే రాయలసీమలో

84శాతం మాత్రమే పెరగగా, కోస్తా ఆంధ్రలో 149 శాతం పెరగగా, తెలంగాణా ప్రాంతంలో 327 శాతం పెరిగింది. ముఖ్యంగా మన రాష్ట్రంలో ప్రధానమైన వరి పంట విషయంలో హెక్టారులో దిగుబడుల పెరుగుదలను చూస్తే కోస్తా ఆంధ్రలో 39శాతం, రాయలసీమలో 20శాతం పెరగగా, తెలంగాణా ప్రాంతంలో 70శాతం పెరిగింది.

Figure 2.25: Land productivity acorss regions in A.P. (output per hectare of net sown area)




Source: Estimated from raw data accessed from G. S. Bhalla and Gurmail Singh. Refer also Bhalla and Singh (2009), Economic Liberalization and Indian Agriculture: A State wise Analysis, Economic and Political Weekly. Vol.XLIV:52

## ఆర్థిక అభివృద్ధి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన దరిమిలా మూడు ప్రాంతాలలోనూ గణనీయమైన సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించబడింది. రాయలసీమ ప్రాంతం కొంత వెనుకబడి వుండగా, తెలంగాణా ప్రాంతం దాదాపు కోస్తా ఆంధ్ర ప్రాంతంతో దగ్గరగా వుందనేది ఈ క్రింది పట్టిక ద్వారా స్పష్టపడుతూవుంది. కోస్తా ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే పేదరికం తెలంగాణాలో తక్కువగా ఉంది.

**Monthly Per Capita Consumption Expenditure Regions and Social groups (2007-08)** — **Poverty Ratio**

| Region/Group | All Groups | SCs | STs | OBCs | Poverty Tendulkar Line % of population | | % Change |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | 1983 | 2007 | |
| Andhra Pradesh | 971 | 719 | 680 | 860 | 59 | 17 | -42 |
| Telangana inc Hyd | 1025 | 734 | 734 | 889 | 59 | 14 | -45 |
| Rayalaseema | 788 | 590 | 803 | 707 | 70 | 28 | -42 |
| Coastal Andhra | 1003 | 759 | 570 | 902 | 53 | 15 | -38 |

Source: Estimates from NSSO's 64th round survery, 2007-08

**రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరులు:**

అన్ని పార్టీలు తెలంగాణా ఏర్పాటుకు అనుకూలతను వ్యక్తం చేసినందువలననే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 30 జులై 2013 న హైదరాబాద్ తో కూడిన తెలంగాణా ఏర్పాటుకు తీర్మానించిందని దిగ్విజయ్ సింగ్ మొదలుకుని మన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులందరూ మాట్లాడుతూ వున్నారు. 2001 లోనే విదర్భ, తెలంగాణా సమస్యలను పరిశీలించడానికి రెండవ ఎస్సార్సీని వేస్తామని కాంగ్రెస్ సి.డబ్ల్యు.సి తీర్మానించిన సంగతిని, ఆ తీర్మానాన్ని జతపరిచి తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పరచాలని వాజ్‌పేయి గారికి కాంగ్రెస్ పార్టీ లేఖ వ్రాసిన వాస్తవాన్ని, 2004 ఎన్నికల మేనిఫెస్టోలో, యు.పి.ఏ ప్రభుత్వ 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' లోనూ, 2004లో రాష్ట్రపతి ప్రసంగంలోనూ తెలంగాణా ఏర్పాటును పరిశీలిస్తామని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని మరుగుపరచి, తెలుగుదేశం పార్టీ లేఖ ఇచ్చినందువల్లనే కాంగ్రెస్ పార్టీ కూడా రాష్ట్ర విభజనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నామని చెప్పటం కంటే నయవంచన మరొకటి వుండదు.

చిదంబరం గారు పార్లమెంటులో తెలంగాణా అంశంపైన తన జీవితంలో ఏ ఇతర అంశంపైన కన్నా ఎక్కువ సమయాన్ని చర్చల కొరకు గడిపానని చెప్పటం శుద్ధ అబద్ధం. ఈ సమస్యను దశాబ్దం కాలంపైగా నాన్చుతూ వచ్చింది కాంగ్రెస్ పార్టీయే. డిసెంబర్ 9, 2009 అర్ధరాత్రి చిదంబరం గారి ప్రకటనకు సీమాంధ్రలో శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ఉవ్వెత్తున ఎగిసిన నిరసన జ్వాలల తీవ్రతను విస్మరించి విభజన నిర్ణయం తీసుకుంది. సామాన్య ప్రజానీకం, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు తమ ప్రయోజనాలను కాపాడుకొనేందుకు పార్టీల నాయకులను, పార్టీలను అవసరమైతే ప్రక్కన పెడతారని, ప్రస్తుత సీమాంధ్ర ఉద్యమం స్పష్టం చేస్తూంది.

'ఇచ్చేది-తెచ్చేది' కాంగ్రెస్సే కావున కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పలుమార్లు బహిరంగంగా ప్రకటించడమే కాక, సెప్టెంబర్ 2012 లో కాంగ్రెస్‌లో తె.రా.స. ను విలీనం చేసే అంశంపైన కూడా కె.సి.ఆర్ కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు జరిపారన్నది బహిరంగ సత్యం. 2004లో రెండవ ఎస్సార్సీ ప్రతిపాదనకు ఒప్పుకున్న కె.సి.ఆర్., అనంతరం ఎస్సార్సీతో నిమిత్తం

లేకుండానే తెలంగాణా రాష్ట్రాన్ని ప్రకటించాలని పదే పదే ప్రకటనలు చేయడం జరిగింది. ప్రజల్ని రెచ్చగొట్టడం వలన అమాయకులైన విద్యార్థులు, యువకులు పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారు. టి.డి.పి. రెండవ పర్యాయం లేఖ ఇస్తేనే కేంద్రం తెలంగాణా రాష్ట్రాన్ని ప్రకటిస్తుందని, తె.రా.స. నాయకులు, కాంగ్రెస్ నాయకులు కొందరు పలు పర్యాయాలు మాట్లాడుతూ వచ్చారు.

1973 దరిమిలా 29 సం॥ల తర్వాత ప్రత్యేక తెలంగాణా డిమాండ్‌కు బీజం వై.యస్.రాజశేఖరరెడ్డి గారేనన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారు కూడా ఇటీవల ప్రకటించారు. తెలంగాణాలో కూడా తమ పార్టీ బలంగా వుండి, అధికారంలోకి రావాలనే లక్ష్యంతో "తెలంగాణా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పరిస్తే తమ పార్టీకి అభ్యంతరం లేదని" ఇడుపులపాయలో జరిగిన ప్లీనరీ సమావేశంలో నిర్ణయం చేయటమే కాక కేంద్ర హోంమంత్రి గారికి కూడా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి విజయమ్మ గారు తెలియపరిచిన వాస్తవాన్ని మరుగుపరిచి ప్రస్తుత పరిస్థితికి కాంగ్రెస్, టి.డి.పి.లు కారణమని ఆ పార్టీ నాయకులు విమర్శిస్తూ వుండటం కడు విడ్డూరం.

తెలుగుదేశం పార్టీ మౌలిక సిద్ధాంతానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడమే కాక 2009 ఎన్నికలలో టి.ఆర్.యస్. పార్టీతో పొత్తు పెట్టుకుని తెలుగుదేశం అధిష్టానం చాలా పెద్ద తప్పు చేసిందన్నది యదార్థం. కనీసం శ్రీకృష్ణ కమిటీ రిపోర్టు వచ్చిన దరిమిలా మూడు ప్రాంతాలలోని పార్టీ ముఖ్యులను, నిపుణులను కూర్చోపెట్టి, విభజన అవసరమా? విభజన వలన ఎదురయ్యే సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు చర్చించి వుంటే బాగుండేది. ఇప్పుడు ఈ పరిస్థితికి కాంగ్రెస్ పార్టీయే కారణమని తమ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకొనే ప్రయత్నం చేస్తూ వుండటం ఆశ్చర్యకరం.

పరస్పర నిందారోపణ ధోరణికి స్వస్తి పలికి, కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించి, శ్రీకృష్ణ కమిటీ సూచించిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమైక్యంగా కొనసాగిస్తూ, తెలంగాణా ప్రాంతీయ కమిటీని ఏర్పాటు చేయించేందుకు అన్ని పార్టీలు సమిష్టిగా కృషి సల్పాలని సీమాంధ్ర ప్రజానీకం కోరుకుంటుంది.

## ఆంధ్రప్రదేశ్ ను కొనసాగించండి : తెలంగాణా ప్రాంతీయ కమిటీని ఏర్పరచండి:

జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ రిపోర్టు దరిమిలా తెలంగాణా వెనుకబడి ఉందనే వాదనను పక్కన పెట్టి, "తెలంగాణా ఆత్మగౌరవం", "తమను తాము పరిపాలించుకోవడానికి రాష్ట్రాన్ని విభజించాలని" తెలంగాణా నాయకులు మాట మార్చారు. అసంబద్ధమైన ఈ వాదనను కేంద్ర కాంగ్రెస్ అధిష్టానం ఆమోదించటం మన రాష్ట్రానికే కాదు, దేశ ప్రయోజనాలకు విరుద్ధం. కేంద్ర హోంమంత్రి షిండే గారు, 5 డిసెంబర్ 2012 న ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు విషయమై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పరిచారు. కాంగ్రెస్, టి.డి.పి, సి.పి.ఐ, వై.యస్.ఆర్.సి.పి పార్టీలు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు అభ్యంతరం లేదని తెలుపగా సి.పి.యం, యం.ఐ.యం పార్టీలు మాత్రం విభజనను వ్యతిరేకించాయి. అయితే ఆ సమావేశంలో గానీ, అనంతరం గానీ విభజనతో ముడిపడిన సమస్యల గురించి ఏ మాత్రం చర్చించి ఉండలేదు. ఫలితంగానే ప్రస్తుత పరిణామాలు. ఆంటోని కమిటీ వలన ఎంత మాత్రము ప్రయోజనం వుండదు.

కావున ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం రాష్ట్రవిభజన అంశాన్ని ఉపసంహరించుకొని కేవలం కొద్ది మంది రాజకీయ నాయకులకు పదవులు కల్పించడమో, కొన్ని రాజకీయ పక్షాలకు ఓట్లు, సీట్లు లభింపచేసుకోవడమో లక్ష్యంగా కాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రజలందరి సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసేలా ప్రాంతీయ అభివృద్ధి మండలులను ఏర్పాటు చేసి, వాటికి అవసరమైన నిధులను కేటాయించి, తమ తమ ప్రాంతాల పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు నిర్ణయించుకొని అమలు చేసే చట్టబద్ధమైన, న్యాయపరమైన అధికారాలను కలుగజేసి మొత్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి దేశ సమగ్రతకు దోహదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వివిధ రాజకీయ పక్షాలు పరస్పర నిందారోపణలకు స్వస్తి పలికి, ప్రజలతో మమేకమై, రాష్ట్రాన్ని సమైక్యంగానే కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. శాంతియుతంగా, సంయమనంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, శ్రామికులు, మహిళలు, అందరూ పట్టుదలతో లక్ష్యాన్ని సాధించేవరకు సమిష్టిగా కృషి జరపాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

"జై సమైక్యాంధ్రప్రదేశ్"

ZION COMPUTERS, VUYYURU - 9014737342

# జై సమైక్యాంధ్ర ప్రదేశ్



తెలుగు ప్రజలు 1000 సంవత్సరాలకు పూర్వంనుండి కలసివున్న చరిత్ర వుంది. కావుననే ఉభయ ప్రాంతాలలోని ప్రజలు కలసి " విశాలాంధ్ర" కావాలనుకున్నారు. హేతుబద్ధమైన, శాస్త్రీయమైన, సమర్ధనీయమైన కారణాలు లేకుండా రాష్ట్రాలను విభజించుకుంటూ వెళితే దేశం ఏమవుతుంది? ఈ ధోరణి ఎక్కడికి వెళ్ళి ఆగుతుంది ?

ప్రధాని **శ్రీమతి ఇందిరా గాంధీ** గారు
డిసెంబరు 21, 1972 లోక్‌సభ ప్రసంగం



తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది.
తెలంగాణా నాదీ, రాయలసీమ నాదీ,
సర్కారు నాది నెల్లూరు నాది,
అన్నీ కలసిన తెలుగు నాడు మనదే మనదేరా.......

ప్రాంతాలు వేరైనా, మన అంతరంగమొకటేనన్నా
యాసలు వేరుగా ఉన్నా మన భాష తెలుగు భాషేనన్న......

ఇంటిలోన అరమరికలు ఉంటే ఇల్లెక్కి చాటాలా !
కంటిలో నలక తీయాలంటే కనుగుడ్డు పెరికి వేయాలా !
పాలు పొంగు మన తెలుగు గడ్డను పగులకొట్టవద్దు
నలుగురిలో మన జాతి పేరును నవ్వుల పాలు చేయ్యొద్దు

**నటసార్వభౌమ శ్రీ నందమూరి తారక రామరావు గారు**
(తల్లా - పెళ్ళామా సినిమాలో)

## "జై తెలుగు తల్లి" "జై సమైక్యాంధ్ర"

VIJAYASAI OFFSET, VIJAYAWADA@92464 99956
ZION COMPUTERS - VUYYURU. CELL : 9014737342